
మంగళవారం 24 ఫిబ్రవరి 2026 https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



లడ్డూ కల్తీపై వాస్తవాలను

## అసెంబ్లీలో పెడతాం

అసెంబ్లీ లాబీలో మంత్రి నారా లోకేష్

- వివరాలు 6 లో..


సామాజిక సమానత్వం కోసమే

# అహర్నిశలూ కృషి

- బలహీన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యత
- అసమానతలు తగ్గించడానికే పీ4 కార్యక్రమం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గతానికంటే ఎక్కువ కేటాయింపులు
- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు
- సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



- వివరాలు 2 లో..



బాధిత కుటుంబాలకు

## పరిహారం రూ.10 లక్షలు

- కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు
- నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- శాసన సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీపాల వినియోగంతో మృత్యువాత పడినవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న ఘటనపై శాసన సభలో మాట్లాడిన సీఎం... బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

3

# పనితీరు ఆధారంగా వెయిటేజ్

- చక్కటి పనితీరు కనబర్చే ఉద్యోగులకు ఇకపై అభినందన లేఖలు
- తాగునీటి శాంపిళ్ల పరీక్షలకు మొబైల్ ల్యాబులు అందుబాటులోకి తేవాలి
- ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- రెవెన్యూ శాఖకు ఫ్రెష్‌లుక్ తీసుకురావాల్సిన అవసరముంది
- టెక్నాలజీతో ప్రభుత్వం అందించే సేవలపై అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ
- ఆర్టీజీఎస్‌నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు

3

నేటినుంచి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ కృషి, పట్టుదల, నమ్మకం మీ విజయానికి బాటలు వేస్తాయి. ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి. మీ అందరి భవిష్యత్తు వెలుగులతో నిండాలని ఆకాంక్షిస్తున్నా.

– నారా లోకేష్, విద్య, ఐటి మంత్రి.






ఆత్మీయ విందు..

## నవ్వుల పసందు

శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంట్ ప్రజాప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ సమావేశం

4



నాకు అత్యంత ఆప్తుడు కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నా. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు లోక్‌సభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి. చివరి క్షణం వరకూ ప్రజా సేవలోనే గడిపిన ఎర్రన్న స్ఫూర్తి అందరికీ ఆదర్శం.

– నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషిచేసిన వ్యక్తి కింజరాపు ఎర్రన్నాయుడు. రాజకీయాలలో విలక్షణమైన నాయకుడిగా పేరుగడించారు. కేంద్రమంత్రిగా, టీడీపీ సీనియర్ నేతగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ ఎర్రన్నాయుడి జయంతి సందర్భంగా ఆయన స్మృతికి ఘన నివాళి.

– నారా లోకేష్, విద్య,ఐటి మంత్రి.

వచ్చేఏడాదే

## భవన నిర్మాణాలు

2

విజయనగరం పాలిటెక్నిక్ కళాశాలపై మంత్రి లోకేష్



కస్తూర్బా స్కూళ్లలో జీతాల పెంపుపై

## కేంద్రంతో సంప్రదిస్తున్నాం


- ఉగాదినాటికి జాబ్ క్యాలెండర్ విడుదలకు కసరత్తు చేస్తున్నాం
- అసెంబ్లీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

5

చైతన్యరథం

# సామాజిక సమానత్వం కోసమే అహర్నిశలూ కృషి

- బలహీన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యత
- అసమానతలు తగ్గించడానికే పీ4 కార్యక్రమం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గతానికంటే ఎక్కువ కేటాయింపులు
- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు
- సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): సామాజిక సమానత్వం కోసమే కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించి జనాభా దామాషా ప్రకారం బలహీన వర్గాలు అన్నిటా ప్రాతినిధ్యం వహించేలా సామాజిక సాధికారత సాధించేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. బడ్జెట్‌లో సంక్షేమ శాఖల కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానిదన్నారు. వీటితోపాటు అన్ని వర్గాలకూ మరింత అదనంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకారుల సేవలో పథకాలతోపాటు చేనేత కార్మికులకు కూడా ఉచిత విద్యుత్‌లాంటి సంక్షేమాన్ని అందించి న్యాయం చేస్తున్నామన్నారు.

## బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు పెంచాం

'చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు మరింత సమర్ధంగా సరకులు అందించేందుకు ప్రణాళిక చేయటంతో పాటు సక్రమంగా చేరవేసేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నాం. సంక్షేమ పథకాలను సాంకేతికత సాయంతో అనుకున్న సమయానికే చేరేలా చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రూ.3.32 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు గతంకంటే పెంచాం. కేటాయించిన మొత్తాలను ఆ వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తాం. సంక్షేమ కార్యక్రమాల ఇవ్వడంతోపాటు ప్రతి వర్గాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ప్రజల ఆదాయాలను పెంచి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం రూ.3 లక్షలు ఉన్న తలసరి ఆదాయాన్ని 2047నాటికి రూ.54 లక్షలకు పెంచే నిర్దుష్టమైన లక్ష్యంతో ముందుకెళుతున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## దృష్టంతా భావితరాలపైనే

'మా దృష్టి అంతా భావితరంపైనే పెట్టాం. అంగన్‌వాడీ కేంద్రాలనుంచి ప్రాథమిక పాఠశాల వరకూ బలోపేతం చేశాం. రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధపెట్టి విద్యను అందిస్తున్నాం. పౌష్టికాహారంతోపాటు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రాన్ని పునర్నిర్మించి అభివృద్ధి చేసి ఆదాయం పెంచడంతోపాటు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు చెప్పాం. నాడు చెప్పినట్టుగానే నేడు ముందుకెళుతున్నాం. పీపీపీ ద్వారా గతంలో సంపద సృష్టికి ముందుకెళ్లాం. పీపీపీ విధానంలో రోడ్లు, విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక వసతులు కల్పన జరిగింది. వీటితో సంపద పెరిగి, మెరుగైన వసతులు ఏర్పడినా అసమానతలు తగ్గలేదు. ఆర్థిక తారతమ్యాలు తగ్గించేందుకు పీ4 విధానాన్ని తీసుకొచ్చాం. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఏ కార్యక్రమంలోనైనా ఫలితాలు వెంటనే రావు. అసమానతలు తగ్గించేందుకు పీ4 మించి కార్యక్రమం మరొకటి ఉండదు. కొందరికి ఉద్యోగాలు ఉండవు. ఇంకొన్ని వర్గాలు కూలీ పని చేస్తే తప్ప పూట గడవదు. అలాంటి వారిని ఆదుకుని పైకి తీసుకురావాల్సి ఉంది. 2047కు భారత్ అగ్ర దేశంగా తయారవుతుంది. వికసిత్ భారత్‌గా తయారయ్యేనాటికి అసమానతలు ఉండటం మంచిది కాదు. ఇది కేవలం పబ్లిక్ పాలసీలవల్లే సాధ్యం అవుతుంది. చట్టసభల్లో ఉన్న మనమందరం కృతనిశ్చయంతో పని చేస్తే ఇది కష్టం కాదు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## స్థానిక సంస్థలకంటే ముందే బీసీలకు రిజర్వేషన్లు

శాసన సభలో ఉన్న మనపై ఎంతో నమ్మకముంచి ప్రజలు ఓట్లు వేశారు. 94శాతం స్ట్రైక్ రైట్‌తో ఎన్డీఏకు సీట్లు ఇచ్చారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కోవాలి. బీసీలకు ఉన్న 34శాతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గించింది. గత ప్రభుత్వం తగ్గించిన రిజర్వేషన్లు మళ్లీ 34కు పెంచేందుకు వన్‌మెన్ కమిటీ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే రిజర్వేషన్లు పెంచి అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తోంది. బీసీ రక్షణ చట్టం ఏర్పాటుకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశాం. అదేవిధంగా బీసీల్లో ఉన్న కొందరు ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నారు. వీటిపై ఇప్పటికే చేసిన బిల్లులను కేంద్రానికి కూడా పంపాం. వాటిని ఫాలోఅప్ చేస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు.

## జీఓ నంబర్3పై త్వరలోనే నిర్ణయానికి వస్తాం

నేను ముఖ్యమంత్రి అయ్యాక మొదటిసారి 1996-1997లో ఎస్సీ వర్గీకరణ చేశాం. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడ లేకపోయాయి. ఇప్పుడు మళ్లీ వర్గీకరణ చేసి ఎస్సీల్లో కూడా సామాజిక న్యాయం చేసిన ఘనత మాది. గిరిజనుల కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ని కూడా గత పాలకులు కాపాడలేకపోయారు. దీంతో ఆ జీఓ నంబర్ 3ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఆచరణతోపాటు అందరికీ ఆమోద యోగ్యంగా జీఓ నంబర్ 3 ఉండాలి. అందుకే సమావేశాలు ఏర్పాటు చేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటాం. మైనారిటీలకు రక్షణ కల్పించడంతోపాటు మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తున్నాం. ఆడబిడ్డలను అన్ని విధాలా ఆదుకుంటున్నాం. ఆస్తి హక్కు, బాగా చదివించడం ఎన్టీఆర్‌తో మొదలయ్యాయి. మహిళలు సాధికారత సాధిస్తే కుటుంబమే కాకుండా సమాజం కూడా సాధికారత సాధిస్తుంది. అగ్రవర్ణాల్లో పుట్టడమే మేంచేసిన పాపమా? అని ఆ వర్గంలోని పేదలు బాధపడుతున్నారు. వారిని కూడా ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. పేదలు ఎక్కడున్నా మా ప్రభుత్వం ఆదుకుంటుంది. త్వరలోనే కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తాం. సంజీవని ద్వారా పేదలకు ఆర్థిక వెసులుబాటు కలిగి ఇబ్బందులు తగ్గుతాయి. అన్ని శాఖలకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ విభాగాల్లో మంచిగా పని చేసి బలహీనవర్గాలను బలోపేతం చేయాలి. ఇది బలహీన వర్గాల ప్రభుత్వం. బలహీన వర్గాలను ఆదుకుంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

# వచ్చే ఏడాదే భవన నిర్మాణాలు

- విజయనగరం పాలిటెక్నిక్ కళాశాలపై మంత్రి లోకేష్
- వర్టికల్ -హారిజంటల్ విధానంలో క్లస్టర్ బేస్డ్ అభివృద్ధికి ప్రాధాన్యత

అమరావతి (చైతన్య రథం): వచ్చే ఏడాది సాస్కీ పథకం కింద విజయనగరం పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అదనపు భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. శాసనసభలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... "ఉన్నత విద్యలో ఇంజనీరింగ్ ఎంత కీలకమో పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ విద్య కూడా అంతే కీలకం. ఈరోజు రాష్ట్రానికి పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయి. ఆ పెట్టుబడులకు సాంకేతిక విద్యాసంస్థలను అనుసంధానం చేయాల్సి ఉంది. ఉత్తరాంధ్రకు డేటా సిటీ, ఫార్మా సిటీ, స్టీల్ సిటీ, మెడికల్ డివైసెస్ సిటీలు వస్తున్నందుకు, ఇందుకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఈ సమయంలో వర్టికల్ -హారిజంటల్ ఇంటిగ్రేషన్ చాలా అవసరం. క్లస్టర్ బేస్డ్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఒక ప్రాంతంలో ఏర్పాటుచేసే పరిశ్రమలకు సంబంధించి అనుబంధ యూనిట్లన్నీ అదే ప్రాంతంలో వచ్చేవిధంగా చర్యలు (వర్టికల్) తీసుకుంటున్నాం. హారిజంటల్ విధానంలో ఆయా పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేసేందుకు కోర్సులు రూపొందించి, అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ లింకేజి కల్పించడానికి చర్యలు చేపడుతున్నాం. విజయనగరంలోని ఎంఆర్ విజిఆర్ పాలిటెక్నిక్ కళాశాల 1982లో స్థాపించారు. ఆనంద గజపతిరాజు భూమితోపాటు ఆ కళాశాలకు భవనాలు నిర్మించి ఇచ్చారు. తర్వాత టిడిపి హయాంలోనే 20వేల చదరపు అడుగుల భవనాలను అశోక్ గజపతిరాజు నేతృత్వంలో నిర్మించడం జరిగింది. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 18 పాలిటెక్నిక్ భవనాలను మంజూరు చేశారు. 2019లో ప్రభుత్వం మారాక ఆ పనులన్నీ నిలిపివేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులన్నింటినీ మళ్లీ సమీక్షిస్తున్నాం" అని తెలిపారు.

విజయనగరంలో ఆనందగజపతిరాజు పాలిటెక్నిక్ కళాశాల 1982లో ప్రారంభమైంది. ఈ కళాశాల కోసం మా తాతగారు మాన్సాస్ ఛైర్మన్‌గా 15ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఇప్పుడు ఆ భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం రూ.1.10 కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధంగా ఉన్నాయి. అదేవిధంగా కొత్తభవనాల నిర్మాణం కోసం గతంలో 2014-19 నడుమ చంద్రబాబు సిఎంగా ఉండగా రూ.8కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఇప్పుడు ఆ ఎస్టిమేషన్ రూ.10కోట్లకు పెరిగింది. ప్రతిపాదనలు ఆమోదించి విజయనగరం పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణం చేట్టాల్సిందిగా విజ్ఞప్తిచేస్తున్నాను. రీఆర్గనైజేషన్ యాక్ట్ మేరకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకొని ఉత్తరాంధ్రలో వెనుకబడి ఉన్న మా జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. సిఎస్ఆర్ ఫండ్స్‌ను కూడా అనుసంధానించి విజయనగరం పాలిటెక్నిక్ భవనాల నిర్మాణం పూర్తిచేయాల్సిందిగా అదితి గజపతిపరాజు కోరారు. భారతదేశంలో తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ జిఎంఆర్ -మాన్సాస్ ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.



మాన్సాస్ తరపున నా తండ్రి అశోక్ గజపతిరాజు ఏవియేషన్ ఎడ్యుసిటీకి అవసరమైన భూమి ఇవ్వగా, మంత్రి లోకేష్ ఇందుకు చొరవచూపినందుకు ధన్యవాదాలు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాటు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్ల ఎంత చేసినా ఇంకా సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని తెలిపారు.

# బాధిత కుటుంబాలకు పరిహారం రూ.10 లక్షలు



- కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు
- నివేదిక రాగానే బాధ్యుడిపై చర్యలు తీసుకుంటాం
- శాసన సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి

అమరావతి (చైతన్య రథం): రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీపాల వినియోగంతో మృత్యువాత పడినవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న ఘటనపై శాసన సభలో మాట్లాడిన సీఎం... బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### కల్తీపాల ఘటన చాలా బాధాకరం

శాసన సభలో రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'రాజమహేంద్రవరం ఘటనలోని బాధితులు వాంతులు, కడుపునొప్పి, దయాలసిస్ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్లినికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. కోరుకొండ మండలం, నరసాపురం గ్రామంలో వరలక్ష్మీ మిల్క్ డెయిరీ 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ నుంచి వచ్చిన పాలను తాగి అనారోగ్యం పాలయ్యారని అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారు. మరో 8మంది చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లకు పైబడిన వారు, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితులనుంచి నమూనాలను తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ల్యాబ్స్‌కు పరీక్షల కోసం పంపించాం. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాసులకు కక్కుర్తిపడి ఈ కల్తీ వ్యవహారానికి పాల్పడితే సీరియస్‌గా తీసుకుంటాం. విచారణ అనంతరం దోషులపై చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో ఎవరైనా కల్తీకి పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా ప్రభుత్వం ఉదాసీనంగా ఉండదు. అత్యంత కఠినంగా వ్యవహరిస్తాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

### అసెంబ్లీలోని ఛాంబర్‌లో సమీక్ష

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో పాల వినియోగంతో స్థానికులు అస్వస్థతకు గురవడం, పలువురు మరణించారన్న ఘటన తెలియగానే ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్షించి ఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయంపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారికి అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75మంది నుంచి శాంపిల్స్ సేకరించామని, మిగిలిన వారందరి నుంచి కూడా నమూనాలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై మరోసారి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, అధికారులతో మధ్యాహ్నం సీఎం చంద్రబాబు సమీక్షించారు.




# పనితీరు ఆధారంగా వెయిటేజ్

- చక్కటి పనితీరు కనబర్చే ఉద్యోగులకు ఇకపై అభినందన లేఖలు
- తాగునీటి శాంపిల్ల పరీక్షలకు మొబైల్ ల్యాబులు అందుబాటులోకి తేవాలి
- ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- రెవెన్యూ శాఖకు ఫ్రెష్‌లుక్ తీసుకురావాల్సిన అవసరముంది
- టెక్నాలజీతో ప్రభుత్వం అందించే సేవలపై అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ
- ఆర్టీజీఎస్‌నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ప్రజలకు మెరుగైన సేవలు అందించడం.. ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులంతా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉద్యోగుల పనితీరును మదింపు చేస్తున్న క్రమంలో పనితీరు సరిగాలేని వారిని మోటివేట్ చేయడంతోపాటు... బాగా పనిచేస్తున్న వారిని గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయిలో చక్కగా పని చేస్తూ... ప్రజల మెప్పు పొందిన ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహిస్తే బాగుంటుందంటూ సీఎం చేసిన సూచనపై పలువురు అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. బాగా పని చేసే ఉద్యోగులకు ఈ తరహా అభినందించడం ఇదే తొలిసారి అవుతుందని చెప్పారు. ఈ రకమైన విధానం వల్ల ఉద్యోగుల్లో పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. బాగా పని చేస్తున్న ఉద్యోగులను గుర్తించడంతోపాటు వారికి అభినందన లేఖలు పంపాలని సీఎం ఆదేశించారు. ఓవైపు పని తీరు మదింపు చేస్తూనే.. మరోవైపు ప్రతి నెల బాగా పనిచేస్తున్న ఉద్యోగులకు అభినందన లేఖ పంపాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పారు. బాగా పనిచేస్తున్న ఉద్యోగులకు అప్రిసియేషన్ లెటర్లు ఇవ్వడమే కాకుండా... వారి వ్యక్తిగత రికార్డుల్లో కూడా వీటిని నమోదు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాగా పని చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూనే... పనితీరు సరిగా లేనివారిని మోటివేట్ చేసేలా చర్యలు తీసుకునే అంశంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### వైద్యాలయాలు బాగుండాలి... దేవాలయాల్లో సౌకర్యాలు మెరుగవ్వాలి

వివిధ శాఖలపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పీహెచ్సీల నుంచి మొదలుకుని అన్ని స్థాయిల్లోని ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఎవరైనా పారిశుద్ధ్యాన్ని సరిగా నిర్వహించకుంటే.. సదరు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులుగా చేయాలి. పారిశుద్ధ్యం విషయంలో ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోని ఆస్పత్రుల జాబితాను సిద్ధం చేయండి. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, మెడికల్ ఎక్విప్మెంట్ అందుబాటులో ఉందా...? లేదా..? అనే అంశంపై ఆయా ఆస్పత్రులకు చెందిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లను బాధ్యులుగా చేయాలి. ఇక ప్రతి ఆస్పత్రిలో డాక్టర్ల కొరత రాకుండా చూసుకోవాలి. ఎక్కడైనా వైద్యుల కొరత ఉంటే.. డాక్టర్లను నియమించుకునేలా చర్యలు తీసుకోండి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆయా జిల్లాల్లోని కలెక్టర్లతో సంప్రదింపులు జరపాలి. గతంతో పోల్చుకుంటే దేవాలయాల్లో సిబ్బంది పనితీరు కొంత మెరుగైనా.. మరింత ఇంప్రూవ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. భక్తులకు సౌకర్యాలు అందించడంతోపాటు... ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసుకోవాల్సిన అంశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



### రెవెన్యూ శాఖను దారిలోకి తేవాలి...

"ప్రజలకు సౌకర్యాలు కల్పించడంతోపాటు జీరో కరెప్షన్ ఉండేలా చూడాలి. ఏసీబీని యాక్టివేట్ చేసే పరిస్థితి రాకూడదు. సరిగా పనిచేయని తహసీల్దార్లను పక్కన పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు. బాగా పని చేసే డిప్యూటీ తహసిల్దార్లను గుర్తిస్తున్నాం. రెవెన్యూ శాఖకు ఫ్రెష్‌లుక్ తీసుకురావాల్సిన అవసరం కన్పిస్తోంది. రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే మార్పు కన్పించాలి. రీ సర్వేతో అన్ని భూసంబంధిత సమస్యలు పోవాలి. మళ్లీ వివాదాలు రాకుండా చూడాలి. రెవెన్యూ సేవలను.. మరీ ముఖ్యంగా భూసంబంధిత సర్వీసులను ఆటోమోషన్లో పెట్టే దిశగా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా సర్వేయర్లు సరిగా వ్యవహరించకుంటే.. కఠినమైన చర్యలు తీసుకుంటాం. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకూడదు. తాగునీరు కలుషితం కాకూడదు. ఎప్పటికప్పుడు తాగునీటి నమూనాలను సేకరించాలి. వాటిని ల్యాబులకు పంపి పరీక్షించాలి. ల్యాబులు అందుబాటులో లేకుంటే మొబైల్ ల్యాబులు పెట్టే దిశగా చర్యలు తీసుకోవాలి. రోడ్ ప్రమాదాలను ఆడిట్ చేయించాలి. ఆడిట్ నివేదికల ఆధారంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

### టెక్నాలజీతో అందించే సేవలపై ప్రజలకు అవగాహన

"ప్రభుత్వం పెద్దఎత్తున టెక్నాలజీని వినియోగించి సేవలు అందిస్తోంది. అలాగే పరిపాలనలోనూ టెక్నాలజీని అడాప్ట్ చేసుకుంటోంది. ప్రభుత్వం టెక్నాలజీ ద్వారా అందించే సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముంది. దీనికోసం మీ సేవ, డ్వాక్రా సంఘాలు, ప్రణాళిక విభాగంవంటి వాటితో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. ఆన్ లైన్లో, ఆఫ్ లైన్లో టెక్నాలజీ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక ఇటీవల ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరయ్యాం. అక్కడ ప్రదర్శించిన టెక్నాలజీలను అధ్యయనం చేయాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఏదు ఎంఓయూలను ఏవిధంగా అమల్లో పెట్టాలనే అంశంపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ఈ మేరకు మున్సిపల్, వైద్యం, వాణిజ్య పన్నుల, ఐటీ, ఇండస్ట్రీస్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టాలి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షల్లో రెవెన్యూ, ఆర్ అండ్ బి, దేవదాయ, వైద్యారోగ్యం, పట్టణాభివృద్ధి, రవాణ, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.





# ఆత్మీయ విందు.. నవ్వుల పసందు

## శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంట్ ప్రజాప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ సమావేశం





ఉండవల్లి (చైతన్య రథం): నారా లోకేష్ ఏర్పాటుచేసిన ఆత్మీయ కలయిక.. అపూర్వ వేదికగా మార్చారు శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంటు సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ సోమవారం ఇచ్చిన విందు నవ్వుల పసందుగా అతిథులందరికీ ఆనందాన్ని పంచింది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ.. కుటుంబసభ్యులను పరస్పరం పరిచయం చేసుకున్నారు. క్షణాల్లోనే అందరూ ఆత్మీయుల్లా మారిపోయి నవ్వుతూ.. నవ్విస్తూ అపురూప క్షణాలను ఆస్వాదించారు. ఒక్కరి ఫోనూ రింగ్ కాలేదు. విందు సమావేశం ముగిసేంతవరకూ ఎవ్వరూ బయటకు కదలలేదు. ప్రేమలు, పెళ్లిళ్లు, పిల్లల బాగోగులు, ప్రాంత ప్రత్యేకతలు చర్చించుకున్నారు. శ్రీకాకుళం వెటకారం, విజయనగరం చతురతతో సంభాషణలు రక్తికట్టాయి. మంత్రి నారా లోకేష్ ఈ విందు సమావేశంలో తన నియోజకవర్గం మంగళగిరి చేనేత ప్రమోషన్‌కు శ్రీకాకుళం ప్రజాప్రతినిధులు పొందూరు ఖాదీతో బదులిచ్చారు. మహాత్మాగాంధీ మెచ్చిన పొందూరు ఖాదీ పంచెలు బహూకరించారు. ప్రజాప్రతినిధులు తనకు ఇచ్చిన వినతుల తాజా నివేదికలను వారికి లోకేష్ అందించారు. నేతల కుటుంబసభ్యులకు మంగళగిరి పట్టుచీరలు లోకేష్ బహుకరించారు. ఈ ఆత్మీయ విందు సమావేశానికి శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి), బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం), గౌతు శిరీష (పలాస), మామిడి గోవిందరావు (పాతపట్నం), గొండు శంకర్ (శ్రీకాకుళం), కూన రవికుమార్ (ఆమదాలవలస), బగ్గు రమణమూర్తి (నరసన్నపేట), విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి కొండపల్లి సాయిశ్రీనివాస్ (గజపతినగరం), కోండ్రు మురళీ మోహన్ (రాజాం), బొబ్బిలి ఆర్‌ఎస్వీకేకే రంగారావు (బేబీనాయన- బొబ్బిలి), కిమిడి కళా వెంకటరావు (చీపురుపల్లి), పి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు (విజయనగరం) లోకం మాధవి (నెల్లిమర్ల -జనసేన), నడికుదిటి ఈశ్వరరావు (ఎచ్చెర్ల -బీజేపీ) కుటుంబసభ్యులతో హాజరయ్యారు.





















## కస్తూర్బా స్కూళ్లలో జీతాల పెంపుపై

# కేంద్రంతో సంప్రదిస్తున్నాం

- ఉగాదినాటికి జాబ్ క్యాలెండర్ విడుదలకు కసరత్తు చేస్తున్నాం
- అసెంబ్లీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని కేజీబీవీల్లో అడ్మిషన్లు దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఉన్నాయని రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... "గత రెండేళ్లలో ఫలితాలు బాగా మెరుగుపర్చాం. రాష్ట్రంలో కేజీబీవిలో చేరడానికి విద్యార్థినులు పోటీ పడుతున్నారు. కేజీబీవి ప్రోగ్రామ్ సెంట్రలైజ్డ్ స్పాన్సర్డ్ స్కీమ్. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులిస్తే, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తోంది. జీతాలు పెంచాలన్నా, ఏ ఇతర నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సివుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌ను పెంచాల్సివుంది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నాం. దానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా స్పందించారు. ఎన్‌టీఎస్‌ను పెద్దలందరూ కోరారు. దానికి కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవాల్సి ఉంది. దాదాపు 11 వేలమంది ఈ వ్యవస్థలో పని చేస్తున్నారు. ఇది 11 వేలమందికి సంబంధించిన విషయం. కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్న తరువాతే జీతాల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై హైకోర్టులో పిటిషన్ ఉంది. దానిపై రివ్యూ చేయడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం పీఏబీ అప్రూవ్ చేసిన తరువాత జీతాలు పెంపుపై మేం బాధ్యత తీసుకుంటాం. ఇప్పటికే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే ఎక్కువ జీతాలు చెల్లింపు జరుగుతోంది. అయినా నేను ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు మాకు బడ్జెట్ పెంచమని కోరాను. మేం తప్పనిసరిగా ఫాలోఅప్ చేస్తాం. డీఎస్సీ గురించి కూడా సభ్యులు ప్రస్తావించారు. గత ఏడాదిలో 16 వేలమంది ఉపాధ్యాయులను నియమించాం. ఈ ఏడాది ఉగాదినాటికి మెగా జాబ్ కేలండర్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ చేయాల్సివుంది. మళ్లీ జోనల్ రీ నోటిఫికేషన్ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ వచ్చింది. రీయూనిఫికేషన్ చేయాల్సిన అవసరముంది. అన్ని డిపార్టుమెంట్లు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. ఉగాదినాటికి మళ్లీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. దాంట్లో ఉపాధ్యాయ పోస్టులు కూడా ఉంటాయి" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## క్రికెట్ మ్యాచ్ చూస్తానంటే

# జగన్‌కూ టికెట్ తీస్తా

### జగన్ వ్యాఖ్యలకు లోకేష్ కౌంటర్

అమరావతి (చైతన్య రథం): వైకాపా హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్ రూ.1000 కోట్లు లబ్ధి పొందాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. "హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందలేదు. కిలో నెయ్యి రూ.360కి ఎక్కడ దొరికినా అది కల్తీయే. మార్కెట్లో రూ.1000పైన ఉంటే.. రూ.360కి ఇచ్చేది కల్తీకాక మరేంటి? ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కో కంపెనీ అనడం విడ్డూరంగా ఉంది. కో కంపెనీ అనేది ఉండదనే విషయం బొత్సకు తెలియదా? ఆధారాలు లేకున్నా.. హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారు" అంటూ లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"మ్యాచ్ చూడడానికి స్టేడియంకు వెళ్లాలా? అని జగన్ అంటున్నారు. టీ20 ప్రపంచకప్‌లో ఇండియా ఫైనలు చేరితే తప్పనిసరిగా వెళ్తా. మ్యాచ్ చూసేందుకు వస్తానంటే పులివెందుల ఎమ్మెల్యేకూ టికెట్ తీసుకుంటా" అని నారా లోకేశ్ వెటకారం చేశారు. బడ్జెట్‌లో చర్చ కావాలని మండలిలో వైకాపా సభ్యులు అనడం హాస్యాస్పదంగా ఉందని, చర్చ కోరుకున్నవాళ్లు 4 రోజులు సభను ఎందుకు అడ్డుకున్నారని లోకేష్ ప్రశ్నించారు.

# దళిత ద్రోహి జగన్!

### అతని ఐదేళ్ల పాలనలో దళితుల ఊచకోత - టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ధ్వజం




మంగళగిరి (చైతన్య రథం): దళిత ద్రోహి జగన్. అతని ఐదేళ్ల పాలనలో దళితులను ఊచకోత కోశారని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ "జగన్‌రెడ్డి ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించాడు. ఆయన ఐదేళ్ల పాలనలో దళిత వ్యతిరేకిగా ముద్ర పడ్డాడు. దళిత ద్రోహిగా తనని తానే రుజువు చేసుకున్నాడు. దళితులు మాకు మేనమామలు.. మాకు బంధుత్వం ఉందని చెప్పి.. పదేపదే చెప్తూ ఉంటాడు. అదంతా అబద్ధమే. ఆయన బంధువుల అభివృద్ధికి ఎప్పుడూ కాంక్షించలేదు. దళితులను ఊచకోత కోసిన వ్యక్తి జగన్‌రెడ్డి. ఆయన పాలనలో దళితులు అనేక ఇబ్బందులకు గురై చాలా బాధలు పడ్డారు. అనంతబాబు ఒక దళితుడిని చంపి.. శవాన్ని డోర్ డెలివరి చేసిన కేసులో ఖాకీ -ఖద్దర్ రెండూ కుమ్మక్కయ్యాయని సుప్రీం కోర్టే వ్యాఖ్యానించింది. దీనివల్ల దళితులకు అన్యాయం జరిగింది. కేసు సజావుగా సాగలేదు. కేసు దర్యాప్తు నానా విధాలుగా నడిచింది. బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చూసిన తరువాత దళితులు మీకు ఎలా బంధువులు జగన్‌రెడ్డి గారు..? దళితులు ఏరకంగా మేనమామలు..? అని వర్ల రామయ్య నిలదీశారు.

జగన్‌రెడ్డి దళితులను అసహించుకున్నారని, దళితులను వేటాడి.. వెంటాడి.. బలి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతబాబు దళితుడిని చంపి.. డోర్ డెలివరీ చేసి.. "బతికివుంటే అసుపత్రికి తీసుకువెళ్లండి.. చస్తే స్మశానానికి తీసుకువెళ్లండి" అని అహంకారంలో మాట్లాడాడు. దీనికి కారణం జగన్‌రెడ్డి వత్తాసు, మద్దతే కారణం. సుప్రీంకోర్టు అదేశించిన నేపథ్యంలో దళితుల అభివృద్ధిని కోరుకునే సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే నాలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. దానితో సరిపోలేదు.. అసలు పోలీసు అధికారి ఆనాటి ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, అనంతబాబు తన చుట్టం అయినట్లు, తన తమ్ముడే ఈ హత్య చేసి రక్షించినట్లుగా వ్యవహరించాడు. ముద్దాయి కూడా అనంతబాబు అని వ్యాఖ్యానించడం.. అతను ఏరకంగా ఈ కేసులో అనంతబాబు రక్షించడానికి తాపత్రయపడ్డాడో అర్థమైంది. దళితులందరూ కూడా ఆ ఎస్పీపై కోపంతో ఉన్నారు. ఎస్పీ తీరుతో మేమంతా రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేశాం. అనాడు ఐజీగావున్న వ్యక్తి ఈ కేసును పర్యవేక్షించాడు. అనాడు డీజీపీగా వ్యక్తి డీజీపీగా ఉండే అర్హత ఉందా...? అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటికే సంబంధిత నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుతున్నాం" అని వర్ల రామయ్య పేర్కొన్నారు.

"ఎస్పీ రిటైర్ అయ్యాడు. అక్కడి రేంజ్ ఐజీ కూడా ముద్దాయికే మద్దతు పలికాడు. అసలు ఎవరినీ కూడా వదలటానికి వీల్లేదు.. రాష్ట్రానికి డీజీపీగా ఉండి.. కేసును నీరుగార్చారు. వీరందరిపై కూడా చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా జగన్‌రెడ్డి అధికార దాహనికి గురైన దళిత బాధితులు చాలామంది ఉన్నారు. వారందరి కేసులను కూడా పున:సమీక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కోరుతున్నాం. అవసరమైతే ఒక కమిషన్ వేయండి.. ఒక కమిటీ వేయండి.. ఒక సిట్ వేయండి.. అనాడు డాక్టర్ సుధాకర్ కావొచ్చు. శిరోముండనానికి గురైన వరప్రసాద్ కావొచ్చు. రాజమండ్రిలో పోలీసు స్టేషన్ వెనుకే ఉన్న ఒక గదిలో మానభంగానికి గురైన దళిత మహిళ కావొచ్చు. మాస్క్ పెట్టుకోలేదని చావకొట్టిన కిరణ్‌కుమార్ కావొచ్చు. మద్యం రేట్లు పెరిగాయి, కల్తీ మద్యం అని వ్యాఖ్యానించి చనిపోయిన ఓంప్రతాప్ కావొచ్చు. జగన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన పులివెందులలో మానభంగానికి గురై, హత్యకు గురైన నాగమణి కావొచ్చు. ఇటువంటి కేసుల మీద సిట్‌ను ఏర్పాటు చేసి దళితులకు న్యాయం చేయాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు. "జగన్‌రెడ్డి పాలనలో దళితుల చాలా అన్యాయానికి గురైయ్యారు. సీఎంగా ఉన్న జగన్‌రెడ్డే దళిత వ్యతిరేకి. కనుక ఆయన పాలనలో కొన్ని కేసులను బయటకు తీసి సిట్ వేసి సమీక్షించి ఏరకంగా పోలీసు అధికారులమీద చర్యలు తీసుకున్నారో.. ఏరకంగా ఆ కేసులను నీరుగార్చి సరైన రీతిలో దర్యాప్తు చేయకుండా.. ఖాకీ - ఖద్దర్ దళితులకు అన్యాయం చేశారో.. సమీక్షించి ద్రర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని వర్ల రామయ్య కోరారు. "జగన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నీరుగార్చారు. జగన్‌రెడ్డి దళిత వ్యతిరేకి. దళితుల అభ్యున్నతిపట్ల జగన్‌రెడ్డి ఏమాత్రం కూడా చిత్తశుద్ధి లేదు. అనాడు జగన్‌రెడ్డి అదేశించాడు.. కాకినాడ ఎస్పీ పాటించాడు. ఫలితం కేసు నీరుగారిపోయింది. ముద్దాయి డిఫాల్ట్ బెయిల్ మీద బయటకు వచ్చాడు. జగన్‌రెడ్డి పాలనలో ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు సరిగ్గా సాగాలేదు. జగన్‌రెడ్డి సీఎం అయిన తరువాత చంద్రబాబు నాయడు పాలనలో దళితుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన 27 పథకాలను రద్దు చేశాడు. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. జగన్ రెడ్డి పాలనలో దళితుల మీద దాడులు పెరిగాయని రాజ్యసభలో అనాటి కేంద్ర మంత్రి చెప్పారు. కేంద్ర మంత్రే ఈ రకంగా చెప్తే జగన్ రెడ్డి దళిత ద్రోహి కాదా..? దళిత వ్యతిరేకి కాదా..? దళితులను ఊచకోత కోయించిన వ్యక్తి కాదా..? అని వర్ల రామయ్య నిలదీశారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 56,981మంది దళితులపై దాడులు జరిగాయి. 192మంది దారుణంగా హత్యకు గురైయ్యారు. కాదని చెప్పే ధైర్యం జగన్‌రెడ్డికి ఉందా..? అని నిలదీశారు. అనంతబాబు మీద జగన్‌రెడ్డి చూపించిన ప్రేమ దళితులకు ఎంత ద్రోహం చేసిందనే విషయాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. హత్య కేసులో మద్దాయిగా ఉన్న వ్యక్తి జైలునుంచి బెయిల్ మీద బయటకు వస్తే మీరు చేసిన హంగామా ఎంత వరకు సబబు జగన్‌రెడ్డి..? అని ప్రశ్నించారు.

"దళితులు ఎవరూ కూడా జగన్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దు. ఛార్జిషీట్‌లో ఏ1గా అనంతబాబు, ఏ2గా అనంతలక్ష్మీ దుర్గ అలియాస్ రోజా (అనంతబాబు భార్య) ఉన్నారు. దర్యాప్తు చాలా బాగా చేశారు. సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ కేసులో అనంతబాబు, అతని భార్య ఎట్టిపరిస్థితుల్లో కూడా తప్పించుకోలేరు" అని వర్ల రామయ్య స్పష్టం చేశారు.



## లడ్డూ కల్తీపై వాస్తవాలను

# అసెంబ్లీలో పెడతాం

**అసెంబ్లీ లాబీలో మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్య రథం): తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయట పెడతా మన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేల ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డుమీదకు తీసుకురావడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.



**మండలి ఛైర్మన్‌ను కలిసిన కూటమి ఎమ్మెల్సీలు**

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజును కూటమి ఎమ్మెల్సీలు ఆయన ఛాంబర్‌లో కలిశారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలతో సభకు వచ్చిన ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విలువైన సమయం వృథా చేయకుండా చూడాలని.. సభ సజావుగా నడిపించాలని కోరారు.

## సుబ్రహ్మణ్యస్వామికి 'సుప్రీం'లో చుక్కెదురు!

**ఏకసభ్య కమిషన్‌ను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ కొట్టివేత**

దిల్లీ: మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది.

కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్/కమిటీని ఏర్పాటు చేయాలని ఈనెల 3న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. నేడు సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.

## తండ్రీ తనయులు..

# సనాతన ధర్మ ద్రోహులు

**వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో మసకబారిన తితిదే ప్రతిష్ట**

కలియుగ ప్రత్యక్ష దైవం, కోట్లాది హిందువుల ఆరాధ్య దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వెలసిన తిరుమల క్షేత్రం కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాదు, అది సనాతన ధర్మానికి సజీవ చిహ్నం. భక్తులు తమ సర్వస్వాన్ని స్వామివారికి అర్పించుకుని, పరమ పవిత్ర భావంతో కొండపైకి అడుగుపెడతారు. కానీ వైఎస్ రాజశేఖరరెడ్డి, తర్వాత తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన ఘటనలు చూస్తే (అన్యమత ప్రచారం, నిబంధనల ఉల్లంఘన, బోర్డులో నాస్తికులు, నేరస్థుల నియామకం. పవిత్రమైన ప్రసాదంలో కల్తీ, లోపించిన పారదర్శకత) ధర్మ శాస్త్రాలను ధిక్కరిస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భక్తుల మనసులలో చెరగని గాయాలే మిగిల్చాయి. స్వార్థ రాజకీయం కోసం, వ్యక్తిగత అజెండాల కోసం, ఆధ్యాత్మిక కేంద్రాలను వాడుకోవడం ఎంతటి వినాశనానికి దారి తీస్తుందో వైఎస్ కుటుంబ పాలనలో తిరుమలలో జరిగిన పరిణామాలు, పాపాలు నిదర్శనంగా కాకపోవు.

**బోర్డు సభ్యులుగా నేర చరితుల నియామకం**

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే తిరుమల పవిత్రతపై పెద్దఎత్తున నీలినీడలు కమ్ముకున్నాయి. తిరుమల అంటే ఏడు కొండల సమాహారం. కానీ వైఎస్ హయాంలో కేవలం రెండు కొండలనే టీటీడీ పరిధిలోకి తెచ్చి, మిగిలిన ఐదు కొండలను ఇతర అవసరాలకు లేదా అన్యమత ప్రచారాలకు వాడుకునేలా ప్రయత్నాలు జరిగాయి. టీటీడీ బోర్డు సభ్యులుగా నేరచరిత ఉన్నవారిని, రాజకీయపరమైన వ్యక్తులను పెద్ద సంఖ్యలో నియమించి, తిరుమలను ఒక రాజకీయ అడ్డాగా మార్చారు. అప్పట్లో టీటీడీ ఛైర్మన్‌గా నాస్తికుడిగా పేరొందిన తన ప్రియశిష్యుడు కరుణాకరరెడ్డికి పగ్గాలు అప్పగించారు. అత్యంత వివాదాస్పదులుగా ముద్రపడిన వారిని ఏరికోరి టీటీడీ పగ్గాలు అప్పగించి, వారి ఇష్టారాజ్యానికి కలియుగ దైవాన్ని, భక్తులను వదిలేశారు. అప్పట్లో భూమన కరుణాకర్‌రెడ్డి.. రాజారెడ్డికి ముఖ్య అనుచరుడు. రాడికల్, విప్లవ రచయితల సంఘంవంటి సంస్థల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. అప్పటినుంచి జుగుప్సాకరంగా హిందూ వ్యతిరేకత రచనలు చేశారు. శ్రీవారి విగ్రహం నల్లరాయి, పాత చెప్పుతో కొడతా, పెకలిస్తా అనేవారు. క్రైస్తవ సంప్రదాయ ప్రకారం తన కుమార్తె పెళ్లి చేసిన కరుణాకర్‌రెడ్డిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించారు. క్రైస్తవ మతానికి అనుకూలంగా ఉన్న వ్యక్తికి అత్యున్నత ధార్మిక సంస్థ ఛైర్మన్ పదవి కట్టబెట్టి భక్తుల మనోభావాలను గాయపర్చారు.

**పద్మావతి వర్సిటీ వీసీగా క్రైస్తవ మత ప్రచారకులు:**

భూమన కుసుమకుమారి అనే భూమన వదినను వైఎస్సార్ హయాంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీగా నియమించారు. 2010లో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవినీతి, మత ప్రచార ఆరోపణలు రావడంతో ఆమెను సస్పెండ్ చేశారు. ఈ చర్య అప్పట్లో వైఎస్ జగన్ వర్గానికి, కాంగ్రెస్ నాయకత్వానికి మధ్య విభేదాలకు కారణమైందని కూడా సమాచారం. అట్లాగే వీణా నోబెల్ దాస్. 2009 ముందు రాజకీయం తెలిసిన వాళ్లకి ఈ పేరు బాగా గుర్తు. వైఎస్ఆర్ ఆమెను పద్మావతి యూనివర్సిటీ వీసీగా నియమించారు. పక్కా క్రిస్టియన్ అయిన ఆమె కూడా పవిత్రమైన పద్మావతి యూనివర్సిటీ వీసీగా చేయని దారుణాలు లేవు. క్రిస్టియానిటీ వ్యాప్తికి ఆమె చేయని పాపాలు లేవు. పవిత్ర తిరుమలని, ఆ సంస్థలను వైఎస్ఆర్, తరువాత జగన్ ఎలా నాశనం చేసే ప్రయత్నం చేసారో వీణా నోబెల్ దాస్ ఒక ఉదాహరణ. యూనివర్సిటీ క్యాంపస్‌లో క్రైస్తవ మత ప్రచారం జరుగుతోందని, ఒక విద్యార్థిని ఆత్మహత్యకు మతమార్పిడి ఒత్తిడే కారణమని అప్పట్లో ఏబీవీపీ, ఇతర సంఘాలు ఆందోళనలు చేశాయి.




**తండ్రిబాటలోనే తనయుడు జగన్**

తండ్రి బాటలోనే నడిచిన జగన్ హయాంలో తిరుమల ప్రతిష్ట గతంలో ఎన్నడూ లేనంతగా మసకబారింది. టీటీడీ ఛైర్మన్లుగా వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించి రాజకీయ అవసరాల కోసం తిరుమలను వాడుకున్నారు. భూమన కరుణాకర్‌రెడ్డి రెండుసార్లు టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. భూమన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే దాదాపు రూ.1,233 కోట్ల విలువైన ఇంజనీరింగ్ పనులను కమీషన్ల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండానే పనులు చేపట్టారు. సుమారు దాదాపు రూ.100 కోట్లు వసూలు చేశారని విమర్శలున్నాయి. హుండీ ద్వారా వచ్చే నగదును లెక్కించే పరకామణి విభాగంలో సుమారు రూ.100 కోట్లమేర అక్రమాలు జరిగాయి, ఒక అధికారి విదేశీ కరెన్సీని దొంగిలిస్తూ దొరికిపోయారు. ప్రస్తుతం ఈ అంశంపై సీఐడీ విచారణ జరుగుతోంది.

**జగన్‌రెడ్డి రక్షక గోవిందా అంటూ పాటలు**

కలియుగ వైకుంఠం, తిరుమల శ్రీవారి సన్నిధిని పక్కా వ్యాపార కేంద్రంగా, స్వార్థ రాజకీయాలకు కూడలిగా మార్చారు. ప్రజలను పెట్టినట్టే.. వేంకటేశ్వరస్వామినీ ముప్పుతిప్పలు పెట్టారు. తర్వాత టీటీడీ ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డిని నియమించారు. ఈయన జగన్‌కి బాబాయ్. ఈయన కూడా హిందువు అని చెప్పుకుని తిరిగారు. కానీ చేసిన పనులన్నీ అడ్డమైన పనులే. స్వామివారి ఆలయ ప్రతిష్టను నాశనం చేసే అంశంలో ఈయన కూడా ఎక్కడా తగ్గలేదు. సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు జరిగింది ఏమిటి? ఏడు కొండలవాడా వెంకట రమణా గోవిందా అంటూ గోవింద నామాలతో మార్మోగే ఆ ప్రాంగణం.. జగన్‌రెడ్డి రక్షక గోవిందా అంటూ పాటలు పాడారు. సుబ్బారెడ్డి భార్య ఏసు కీర్తనలు పాడుతూ, ఎన్నోసార్లు కనిపించినట్టు సమాచారం. ఇటువంటి సుబ్బారెడ్డి బాబాయిని జగన్ టిటిడి ఛైర్మన్ చేసేశారు. వెంకన్న సన్నిధిని సుబ్బారెడ్డి తన జాగీరుగా మార్చుకున్నారు. కొండపై సొంత సామ్రాజ్యం ఏర్పాటు చేసుకుని అడ్డగోలు వ్యవహారాలతో తిరుమల తిరుపతిని భ్రష్టు పట్టించారు. వెంకన్న భక్తిలో తరించాల్సిన ఆయన వీవీఐపీల సేవలో తరించారు. వీవీఐపీ దర్శనాలు టీటీడీ నిబంధనల ప్రకారం ఛైర్మన్ కోటా కింద రోజుకు సగటున ఆరునుంచి 12మందికి మాత్రమే కల్పించాలి. ఒక్కో సిఫారసు లేఖపై ఆరుగురిని ఈ దర్శనాలకు అనుమతిస్తారు. కానీ వైవీ సుబ్బారెడ్డి జమానాలో మాత్రం రోజుకు సగటున 60 సిఫారసు లేఖలు ఇచ్చి 364 మందికి వీవీఐపీ దర్శనాలకు వీలు కల్పించారు. ఛైర్మన్‌గా నాలుగేళ్ల కాలంలో 3,60,338 మందికి దగ్గరుండి దర్శనాలు చేయించారు. తర్వాత భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న 9 నెలల కాలంలోనే ఏకంగా 43 వేల మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అంటే సగటున రోజుకు 172 మందికి దర్శనాలు చేయించారు. దర్శనాల పేరిట తిరుమల పవిత్రను కాసుల వేటకు వేదికగా మార్చారు. మంది మార్బలాన్ని వెంటేసుకుని ఎప్పుడు బడితే అప్పుడు దర్శనానికి వెళ్తూ సామాన్య భక్తులకేమో నరకం చూపించారు.

**నెయ్యి కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం**

గతంలో టీటీడీ ఈఓగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించేవారు. కానీ ఆ సంప్రదాయాన్ని కాలదన్నిన జగన్‌రెడ్డి.. తనకు కావాల్సిన ధర్మారెడ్డిని (జగన్‌రెడ్డికి బావని) ఢిల్లీనుంచి డెప్యుటేషన్‌పై తీసుకొచ్చి టీటీడీపై సర్వాధికారాలు కట్టబెట్టడంతో ఆయన వెంకన్నస్వామి సేవకుడిగా కాకుండా.. జగన్‌కి సేవకుడిగా పనిచేశారు. తన యజమాని చీకటి వ్యవహారాలెన్నింటినో చక్కబెట్టారు. ధర్మారెడ్డిని నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలం డిప్యుటేషన్‌పై ఉంచారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూ పవిత్రత మంటగలిసింది ఈయన హయాంలోనే. లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ.. ఇది కేవలం అవినీతి మాత్రమే కాదు. కోట్లాది భక్తుల విశ్వాసాలపై జరిగిన దాడి. తిరుమల నెయ్యి కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 2020లో నెయ్యి ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మార్పులు తీసుకువచ్చి, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అప్పటివరకు తిరుమల ఆలయం అవసరాల కోసం సరఫరా చేస్తున్న నందినీ బ్రాండ్ నెయ్యిని నిలిపివేయడంతో తిరుమల పవిత్రత పూర్తిగా సంక్షోభంలో పడింది. సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో 2019-2024 మధ్య కాలంలో సరఫరా అయిన నెయ్యి రసాయనాలతో తయారు చేసినట్టు సుప్రీం కోర్టు ఆదేశాలతో నియమించబడిన సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో బయటపడిన విషయం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

**సనాతన ధర్మంపట్ల గౌరవం లేదని నిరూపణ**

వైఎస్సార్, జగన్‌రెడ్డి ఏనాడూ సతీ సమేతంగా వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన దాఖలా లేదు. అంతే కాదు అన్యమతస్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకునేటప్పుడు స్వామివారిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం ఆనవాయితీ. కానీ జగన్ ముఖ్యమంత్రి హోదాలో పలుమార్లు దీనిని ధిక్కరించి, సనాతన ధర్మంపట్ల గౌరవం లేదని నిరూపించుకున్నారు. టీటీడీ ఆలయాల్లోకి అన్యమతస్తులు ప్రవేశించే ముందు డిక్లరేషన్ ఇవ్వాలని 1900 ఏప్రిల్ 11న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ అంశాన్ని చాప్టర్ 18లో పొందుపర్చారు. హిందూ సాంప్రదాయం ప్రకారం క్రిస్టియన్ అయిన జగన్ తిరుమలకు వెళ్లి కనీసం రిజిస్టర్‌లో సంతకం చెయ్యకుండా హిందూమత సిద్ధాంతానికి విరుద్ధంగా వ్యవహరించారు. ఈవిధంగా వైఎస్ కుటుంబం స్వలాభం కోసం ఆంధ్రప్రదేశ్‌ను ఛిద్రం చేసిన విధంగానే, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వర స్వామిని వదలకుండా ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పటికైనా తిరుమలవంటి పుణ్యక్షేత్రాలను రాజకీయ జోక్యం నుండి విముక్తి చేయాల్సిన అవసరం ఉంది. 'ధర్మో రక్షతి రక్షితః' అన్న సూక్తి ప్రకారం, మనం ధర్మాన్ని రక్షిస్తేనే ఆ దైవం మనల్ని రక్షిస్తాడు. పాలకులకు భక్తి లేకపోయినా ఫర్వాలేదు కానీ, భక్తుల నమ్మకాలను అపహాస్యం చేసే హక్కు మాత్రం లేదు. తిరుమల వైభవాన్ని పునరుద్ధరించడం, సనాతన ధర్మం యొక్క పవిత్రతను కాపాడటమే శ్రీవారికి మనం అర్పించే నిజమైన నీరాజనం. రాజకీయాలు గేటుబయటే ఉండాలి. తిరుమల కొండపై కేవలం గోవింద నామ స్మరణే సాగాలి!!

**- నీరుకొండ ప్రసాద్**

# సోషల్ మీడియా దందాను ఉపేక్షించేది లేదు



**విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు - ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న చట్టాలను పరిశీలిస్తున్నాం - 20 నెలల్లో 1384 కేసులు నమోదు: హోంమంత్రి అనిత**

అమరావతి (చైతన్య రథం): సోషల్ మీడియాలో విద్వేష పూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు రూపొందిస్తున్నట్టు హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘం దీనిపై లోతైన అధ్యయనం జరుపుతోందని శాసన సభకు వివరించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల నియంత్రణపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానమిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు ఉపసంఘం రెండుసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిందన్నారు.

తమిళనాడు, కర్ణాటకవంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చర్యలను సమీక్షించినట్టు చెప్పారు. మన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే సమర్థవంతంగా ఉంటాయన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు సోషల్ మీడియా పోస్టులపై 1,384 కేసులు నమోదు చేసినట్టు చెబుతూ.. ఇందులో 1,067మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని వివరించారు. తప్పుడు ప్రచారాల కట్టడికి కొత్తచట్టం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించకుండా చట్టం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్టు హోంమంత్రి అనిత తెలిపారు.

# ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి

- **పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం**
- **కూటమి పాలనలో పేద విద్యార్థుల అభ్యున్నతికి పెద్ద మొత్తంలో నిధులు**
- **మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

అమరావతి (చైతన్యరథం): పేదరికం లేని సమాజమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, షెడ్యూల్ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం 2026-27 బడ్జెట్‌లో భారీ స్థాయిలో నిధులు కేటాయించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ప్రజల విద్య పురోగతి, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, వారి హక్కుల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.11,118 కోట్లు సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించామన్నారు. ఎస్సీసబ్ ప్లాన్ కింద రూ. 20,643.57 కోట్ల రూపాయల్ని కేటాయింపు జరిగిందన్నారు. ఇది గతేడాది కంటే రూ. 362.65 కోట్లు ఎక్కువ. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వినియోగంపై రెగ్యులర్‌గా నోడల్ ఏజెన్సీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. వసతి గృహాల నిర్మాణాలకు రూ.581 కోట్లు, ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కింద రూ. 389 కోట్లు, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కింద 3,23 కోట్లు, ఉచిత విద్యుత్‌కి రూ. 300 కోట్లు, ఆదర్శ గ్రామీణ యోజనకు రూ. 185 కోట్లు, అత్యాచార బాధితులకు ఆర్థిక సాయం కోసం రూ. 90 కోట్లు, హాస్టల్ భవన నిర్మాణాలకు రూ. 64 కోట్లు, కులాంతర వివాహ పథకానికి రూ.13.95 కోట్ల రూపాయలు కేటాయింపు జరిగిందన్నారు. పేద పిల్లల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, వారు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే రూ.143 కోట్లతో 783 హాస్టళ్లకు మరమ్మతులు చేయించటం జరిగిందన్నారు. రూ. 55 కోట్లతో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా అదనపు టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. రూ. 60 కోట్లు సాస్కి నిధులతో ఆర్వో ప్లాంట్లు, మస్కిటో నెట్లు ఏర్పాటు చేశామన్నారు. 2025-26 బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు రూ. 365 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ ఖర్చు పెట్టలేదని గుర్తు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉమ్మడి జిల్లా కొక వైద్యాధికారిని నియమించామన్నారు. విద్యార్థుల అనారోగ్యం పాలైతే ప్రత్యేక చొరవతో కార్పోరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన పలువురు విద్యార్థులకు సీఎం



చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ నిధులిచ్చి ప్రాణాలు కాపాడారని వెల్లడించారు. 150 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం వారికి జర్మనీలో ఉపాధి కల్పిస్తామన్నారు. 340 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. 140 మందికి ఎస్సెస్సీ, ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. డీఎస్సీ ఉచిత కోచింగ్ వల్ల 300 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారని వివరించారు. అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు గతేడాది ఐఐటీ నీట్‌లో 57 మంది సీట్లు సాధించారన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్ల సంఖ్యను 3 నుంచి 10కి పెంచామన్నారు. ఈ ఏడాది 161 విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అర్హత వెల్లడించారు. పీఎం అజయ్, టీఎంఎఫ్ నిధులు రూ.104 కోట్లతో 30 హాస్టళ్ల నిర్మిస్తున్నామని తెలిపారు. వైసీపీ హయాంలో నిర్వీర్యమైన లిడ్ క్యాప్‌ని పునరుద్ధరిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం యడవల్లి, కృష్ణా జిల్లా జీ కొండూరులో రూ. 11.5 కోట్లతో ఫుట్ వేర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేశామన్నారు. డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తింపచేశామన్నారు. కొటక్ మహీంద్ర , తిరుపతి తలార్ యూనివర్సిటీ సహకారంతో అంబేద్కర్ గురుకులాల్లో వంట మనుషులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలు చేస్తున్నామని ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని గురుకులాల్లో పంక్చనరీ లిటరసీ అండ్ న్యూమరసీ గ్రేడింగ్ విధానం తీసుకొస్తామని తెలిపారు. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు సాంత్వన పథకంతో ఆర్థికంగా సాయం చేస్తున్నామన్నారు. ఎస్సీ కాలనీల్లో స్మశాన వాటికల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఎస్సీల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## కల్తీపాల ఘటనను తీవ్రంగా పరిగణించాలి

**- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి అస్వస్థతకు గురైన బాధితులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన మాధవ్, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, ఆహార భద్రత విభాగం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. పాల నాణ్యతపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కల్తీ పాల తయారీ, సరఫరాలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎలాంటి అలక్ష్యం సహించబోదని ఆయన స్పష్టం చేశారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **ఈ - శ్రమ్ పోర్టల్‌లో 88.16 లక్షల కార్మికులు**
- **ఏపీ భవన నిర్మాణ సంక్షేమ మండలిలో 18.24 లక్షల మంది**
- **కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

అమరావతి (చైతన్యరథం): అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. అసంఘటిత కార్మిక రంగానికి సంబంధించి ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సుభాష్ సోమవారం అసెంబ్లీలో సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, ఇ - శ్రమ్ పోర్టల్‌లో మొత్తం 88,16,453 మంది అసంఘటిత కార్మికులు తమ సమాచారాన్ని నమోదు చేసుకున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి పోర్టల్ లో 18,24,221 మంది తమ పేర్లను నమోదు



చేసుకున్నారని చెప్పారు. వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల నమోదును వేగవంతం చేస్తున్నామన్నారు. కార్మికుల ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అసంఘటిత కార్మికులకు ఉచిత వైద్య సేవలతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ప్రసూతి సహాయం కోసం రూ.20 వేలు, వివాహ కానుక కింద రూ.40వేలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.60 వేలు, సహాయం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చులకు తక్షణమే రూ.20వేలు ఆర్థిక సహాయం చేస్తున్నామని మంత్రి వివరించారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ పథకం కూడా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల నైపుణ్యాలను పెంపొందించి వారి ఉపాధి అవకాశాలను మెరుగు పరచడమే లక్ష్యంగా కార్మిక సంక్షేమ మండలి ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందని మంత్రి సుభాష్ వెల్లడించారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు భవనాలతో సంబంధం లేకుండా భవన నిర్మాణ కార్మికులు వివిధ పనుల్లో నిమగ్నమై ఉండటంతో పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. అసంఘటిత కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సుభాష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు.

# కొత్త బడ్జెట్‌లో సింహభాగం బీసీలకే

- త్వరలో కుట్టు మిషన్ల పంపిణీ
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- నేతన్న భరోసాకు రూ.250 కోట్లు కేటాయింపు
- రూ.500 కోట్లతో 20 ఎంజేపీ స్కూళ్ల భవనాల నిర్మాణం
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు డెడికేటెడ్ కమిషన్ నియామకం
- బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నాం
- టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం
- బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్‌పై చర్చలో మంత్రి సవిత

అమరావతి (చైతన్యరథం): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు. బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, బడ్జెట్‌లో సింహభాగం నిధులు వారికే కేటాయించారని తెలిపారు. 20 నెలల కూటమి ప్రభుత్వ పాలన బీసీల అభ్యున్నతికి ఇచ్చిన హామీలతో పాటూ ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్నారు. నేతన్న భరోసా పథకం కింద రూ.250 కోట్లు వెచ్చించనున్నామని ప్రకటించారు. 2026-27 బడ్జెట్ కు సంబంధించి అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌తో బీసీలకు ప్రాధాన్యమిచ్చి, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు బీసీలకు రెండు కళ్లవంటి వారన్నారు. 3.32 లక్షల కోట్ల బడ్జెట్‌లో వెనుబడిన తరగతులకు రూ.51,020.56 కోట్లు కేటాయించారని వెల్లడించారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని, గీత కులాలకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. నాయీబ్రాహ్మణ సెలూన్లకు ఉచిత విద్యుత్ సరఫరాను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు, దేవాలయ సేవల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామని తెలిపారు.

### త్వరలో కుట్టు మిషన్లు

ప్రతి ఇంటి నుంచి ఒకరు వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు అందజేయనున్నామన్నారు. రూ. వెయ్యి కోట్లతో ఆదరణ 3.0 అమలు చేయనున్నామన్నారు.

### బీసీల రక్షణ చట్టానికి తుది రూపు

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మగ్గం నేసే చేనేతలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, తదుపరి చర్య కోసం కేంద్రప్రభుత్వానికి పంపించామన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం రూపకల్పనకు తుది రూపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఇటీవలే రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించామన్నారు. ఈ కమిషన్‌కు నివేదిక అందజేయడానికి 45 రోజుల గడువు



విధించామని మంత్రి సవిత తెలిపారు.

### రూ.500 కోట్లతో ఎంజేపీ స్కూళ్ల నిర్మాణం

అన్ని గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల రక్షణ సౌకర్యార్థం సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లతో పాటు గురుకుల పాఠశాలల్లో కూడా పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడానికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. 6 ఎంజేపీ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. 20 ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణానికి సాస్కి పథకం కింద రూ.500 కోట్లు మంజూరు చేయనున్నామన్నారు. సింహాచలం, టేకులోడు ఎంజేపీ స్కూల్లో ఐఐటీ, నీట్ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నామన్నారు. రూ.22 కోట్లు వెచ్చించి గురుకులాలకు, వసతి గృహాలకు అవసరమైన వంట పాత్రలు సరఫరా చేశామన్నారు. అన్ని వసతి గృహాల్లోనూ యూపీఎస్‌లు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాలికల వసతి గృహాల్లో రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, ఇతర సౌకర్యాల కోసం అన్ని వసతి గృహాల్లోనూ దోమల నిరోధకాలు ఏర్పాటు చేశామన్నారు.

### రూ.250 కోట్లతో 'నేతన్న భరోసా' అమలు

కొత్త బడ్జెట్‌లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద 30 లక్షల మంది బీసీలకు రూ. 11,913.21 కోట్లు కేటాయించామని మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం పథకం కింద తల్లి ఖాతాకు ఒక్కో పిల్లవానికి రూ. 15,000 చొప్పున అందించేందుకు రూ. 4,097.63 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దీపం 2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లకు రూ. 1,383.62 కోట్లు కేటాయించామన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్‌కు రూ.50 కోట్లు, నేతన్నలకు విద్యుత్ సబ్సిడీకి రూ. 150 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఆర్థిక సహాయానికి రూ. 250.42 కోట్లు, నేతన్నలకు ముడి సరకుల కొనుగోలు, మగ్గాల మరమ్మతుల సహాయానికి రూ. 226.11 కోట్లు, నేతన్న భరోసా పథకం కోసం రూ.250 కోట్లు కేటాయించామని మంత్రిసవిత తెలిపారు. ఈ పథకం కింద నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల 2026, 27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 10,699.33 కోట్లు కేటాయించామన్నారు.

### బీసీల ద్రోహి జగన్

జగన్ ప్రభుత్వంలో బీసీలతో పాటు అన్ని వర్గాల వారు ఇబ్బందులు పాలయ్యారని మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అయిదేళ్లలో ప్రశ్నించిన బీసీ నాయకులపై కేసులు పెట్టారన్నారు. బీసీ బిడ్డల చదువులను నిర్లక్ష్యం చేస్తూ, సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సరిపడా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని మంత్రి సవిత మండిపడ్డారు.

### బీసీలకు చంద్రబాబుతోనే రాజకీయ ప్రాధాన్యం

బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యమిస్తున్న ఘనత చంద్రబాబుదేనని మంత్రి సవిత కొనియాడారు. కేబినెట్‌లో ఎనిమిది మంత్రులను, అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడిని, కేంద్రమంత్రిగా రామ్మోహన్ నాయుడిని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావును ఇలా పార్టీలోని కీలక పదవుల్లోనూ బీసీలను నియమించారని మంత్రి సవిత వివరించారు.

# వివక్ష లేని సమాజ నిర్మాణమే ధ్యేయం

- మైనారిటీల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి
- రూ. 6090 కోట్లు బడ్జెట్ కేటాయింపు గర్వకారణం
- బడ్జెట్ చర్చలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- గత ప్రభుత్వంలో నిలిపేసిన పనుల పునరుద్ధరణకు చర్యలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని మైనారిటీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో మంత్రి ఫరూక్ మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం మన బలం, సౌభ్రాతృత్వం, సమానత్వం, వివక్ష లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో మైనారిటీల సంక్షేమానికి రూ. 5434 కోట్లు కేటాయిస్తే, ఇందుకు అదనంగా రూ. 656 కోట్లు జత చేసి, మొత్తం రూ. 6090 కోట్లు భారీ మొత్తం తో 2026-2027 బడ్జెట్లో మైనారిటీలకు కేటాయించడం జరిగిందని అన్నారు. మైనారిటీ సబ్ ప్లాన్ ద్వారా రూ. 3133 కోట్లు, సంక్షేమ విభాగం ద్వారా రూ. 2957 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ. 1617 కోట్లు, ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం కింద రూ. 300 కోట్లు, ముస్లిం మైనారిటీల స్వయం ఉపాధి ఆర్థిక భరోసా రాయితీ రుణాలకు రూ. 183.90 కోట్లు, క్రైస్తవ మైనారిటీల స్వయం ఉపాధి ఆర్థిక భరోసా కోసం రూ. 21.20 కోట్లు, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల వసతి గృహాల నిర్మాణం కోసం రూ. 20 కోట్లు కేటాయించామని మంత్రి ఫరూక్ వివరించారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికునికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. గతంలో ఉర్దూ అకాడమీకి కేవలం రూ. లక్ష



బడ్జెట్ మాత్రమే ఉండేదని, కూటమి పాలనలో రూ. 7 కోట్లు కేటాయించామని, దీన్నిబట్టి మైనారిటీల సంక్షేమానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదో స్పష్టమవుతున్నదని అన్నారు. ఉర్దూ ఘర్ కం షాదీఖానాల కోసం రూ. 2.85 కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. అయితే వీటి నిర్మాణాల కోసం బడ్జెట్ పెంచాలని ఎమ్మెల్యేల నుంచి డిమాండ్ వస్తున్న దృష్ట్యా విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఇమాములు, మౌజమ్‌లకు రూ. 90 కోట్లు గౌరవ వేతనాలు, క్రైస్తవుల సంక్షేమం కోసం రూ. 115.50కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

### మైనారిటీల సంక్షేమ ఆద్యులు ఎన్టీఆర్, చంద్రబాబు

రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం విప్లవాత్మకమైన పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావు దేనని, అప్పటి నుండి ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మైనారిటీ సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయని, భారీగా బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయని మైనారిటీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సభలో వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపులపై చాలా ఏళ్ల తర్వాత డిమాండ్లపై సభలో చర్చ జరగడం శుభ పరిణామమన్నారు.

### నిలిపేసిన పనుల పునరుద్ధరణకు చర్యలు

2019లో తాను మైనారిటీ మంత్రిగా ఉన్న సమయంలో రూ. 600 కోట్ల అంచనాలతో మసీదులు, చర్చిల మరమ్మతులు, షాదీ ఖానాల నిర్మాణం కోసం చంద్రబాబు నిధులు మంజూరు చేశామని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ పనులన్నింటినీ పూర్తిగా నిలిపివేసిందన్నారు. రూ. 20 కోట్లతో గుంటూరులో నిర్మించతలపెట్టిన క్రిస్టియన్ భవన్, కడపలో హజ్ హౌస్ నిర్మాణాలను కూడా గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. వీటన్నింటినీ మళ్ళీ పునరుద్ధరించాలని ఎమ్మెల్యేలంతా అడుగుతున్నారని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఎక్కువసార్లు మైనారిటీ బడ్జెట్ ప్రవేశపెట్టడం గౌరవంగా భావిస్తున్నానని మంత్రి ఫరూక్ ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి అత్యధిక మొత్తంలో బడ్జెట్ కేటాయింపు జరగడం మైనారిటీగా ఎంతో గర్వపడుతున్నానని మంత్రి ఫరూక్ అన్నారు. ముఖ్యంగా ఎక్కువసార్లు మైనారిటీ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం తనకు దక్కిందని, ఇది తెలుగుదేశం పార్టీ తనకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఆ సమయంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు జోక్యం చేసుకుని నీపైన బాధ్యత పెరిగిందని అనగా అది మన పట్ల ముఖ్యమంత్రికి ఉన్న ప్రేమ, ఆప్యాయతకు నిదర్శనమన్నారు. రూ. 2957 కోట్లతో ప్రతిపాదించిన 2026-2027 ఆర్థిక సంవత్సరపు మైనారిటీ బడ్జెట్‌ను ఆమోదించాలని మంత్రిఫరూక్ సభాముఖంగా కోరారు.

చైతన్యరథం

# ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం

**- హోం మంత్రి అనిత స్పష్టీకరణ**



అమరావతి (చైతన్యరథం): జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

## మంత్రి మండిపల్లితో ఆర్టీసీ ఎండీ భేటీ

**- స్త్రీ శక్తి పథకం అమలుపై చర్చ**

**- భవిష్యత్ కార్యాచరణలపై కీలక సమావేశం**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీ ఎన్ బాలసుబ్రమణ్యం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వ్యవస్థ బలోపేతం, స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై, అలాగే ఆర్టీసీలో తదుపరి కార్యాచరణలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.



# లిఫ్టుల పునరుద్ధరణకు రూ.595 కోట్లు

- **రూ. 765 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం**
- **అసెంబ్లీలో జల వనరుల శాఖ మంత్రి మంత్రి నిమ్మల రామానాయుడు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా మూతపడ్డ 611 లిఫ్టుల పునరుద్ధరణకు రూ 595 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. రాష్ట్రంలో 1008 లిఫ్టులు ఉంటే అందులో 613 పనిచేయడం లేదన్నారు. కేవలం 158 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. మిగతావి అరకొరగా పని చేస్తున్నాయన్నారు. అలాగే ఓ అండ్ ఎం పనుల కోసం 765 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ పనులు కోసం ఆ ప్రభుత్వం కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందని మంత్రి వివరించారు. తాము ఒక ఏడాదిలోనే 708 కోట్ల నిధుల కేటాయించడం చూసి ఆ ప్రభుత్వానికి మాకు తేడా తెలుసుకోవాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్ లిఫ్ట్ స్కీమ్స్ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందలేదన్నారు. 2019 నుండి పైడిమెట్ట ఎత్తిపోతల పథకానికి నిర్వహణ లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్టు పరిధిలో 50శాతం ఆయకట్టుకు సాగునీరు అందలేదని మంత్రి చెప్పారు.యనమదుర్రు డ్రెయిన్‌పై 54 ఇన్‌లెట్‌లకు గానూ, 46 ఇన్‌లెట్‌లు శిధిలావస్థలో ఉన్నాయన్నారు. గత వైసీపీ పాలనలో ప్రాజెక్టులు, కాలువలు, డ్రైన్ల నిర్వహణ వ్యవస్థ కుప్ప కూలిపోయిందన్నారు. పూడికతీత, లాకులు, షట్టర్లు, రోప్స్ వంటి పనులు, మరమ్మతులు మాట అటుంచి గ్రీజు మెయింటెన్స్ కూడా పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో రిపేర్లకు ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీం లు మూత పడ్డాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరిచ్చే విధంగా ఉన్న అన్నినీటి వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా ఈ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని మంత్రి రామానాయుడు వివరించారు.

## మన్‌కీ బాత్‌కు అత్యంత ప్రజాదరణ

**- మంత్రి డాక్టర్ డోలా**



అమరావతి (చైతన్యరథం): అత్యంత ప్రజాదరణ పొందిన రేడియో కార్యక్రమం ప్రధాని మోదీ మన్ కీ బాత్ (మనసులో మాట) అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రూపొందించిన మన్ కీ బాత్ (మనసులో మాట) విద్యార్థుల క్విజ్ కాంపిటేషన్ పోస్టర్‌ను వెలగపూడి సచివాలయంలో సోమవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ పొందిన రేడియో కార్యక్రమం అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మన్ కీ బాత్, 2014 అక్టోబర్ 3న ప్రారంభమైన ఈ కార్యక్రమం, వివిధ రంగాల్లోని విజయాలు, సామాజిక అంశాలు, ఆత్మనిర్భర్ భారత్, యువత స్ఫూర్తిదాయక కథలను తెలియజేస్తూ 23 జాతీయ భాషల్లో ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ సామాన్యుల సందేశాలను, ప్రముఖుల విజయ గాథల్ని వివరిస్తూ ప్రజలతో నేరుగా అనుసంధానమవుతున్నారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఆదరిస్తున్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వినియించుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

## బీసీల అభ్యున్నతికి ఐలాపురం వెంకయ్య సేవలు చిరస్మరణీయం

**వెంకయ్య కుటంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): ఇటీవల మృతి చెందిన ప్రముఖ బీసీ నాయకుడు, వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కుటుంబ సభ్యుల్ని ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం పరామర్శించారు. దుర్గా అగ్రహారంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయన కుమారులు ఐలాపురం రాజా, ఐలాపురం అరుణ్ కుమార్‌లతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఐలాపురం వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తగా హోటల్ రంగంలో, బీసీ నాయకుడిగా, ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలను ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ ఎన్ఐ.ఆర్డీ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహచౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి చరణ్ సాయిలతో పాటు పలువురు నాయకులు, అనుచరులు అభిమానులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మేకా అండతో స్థలం కబ్జా

- **టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు**
- **తప్పుడు పత్రాలతో భూమి ఆక్రమణ**
- **ఇల్లు కూల్చేందుకు పన్నాగం**
- **అర్జీలు స్వీకరించిన టీడీపీ జాతీయ కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్ రావు**



మంగళగిరి (చైతన్యరథం): ఏలూరు జిల్లా నూజివీడు మండలం హనుమంతుని గూడెం గ్రామానికి చెందిన యండ్రపాటి రాంబాబు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో తమ సమస్యలను ఏకరువు పెడుతూ అర్జీ ఇచ్చారు. తమ గ్రామంలో తమకు వారసత్వంగా సర్వే నెం.103/3లో 0.27 సెంట్లు స్థలంలో 0.05 సెంట్ల భూమిని యండ్రపాటి ఏసుదాసు, పెంటయ్య, రవికిరణ్ అనే వ్యక్తులు ఆక్రమించుకున్నారని పేర్కొన్నాడు. ఈ స్థలంలో బిల్డింగ్స్ సైతం కడుతున్నారు. 2018లో స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే ఒత్తిడితో ఒక్క అధికారి కూడా ఈ స్థలం చూడడానికి రాలేదు" దీనిపై వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని తెలుగుదేశం జాతీయ కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్ రావుకు అర్జీ ఇచ్చి వేడుకున్నాడు. "తమ గ్రామ పరిధిలో సర్వే నెం.117, 19/1, 132-2లో తమ భూమిని కొందరు ఫోర్జరీ చేశారని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం దళ్లాయిపేట గ్రామానికి చెందిన బిరిడి శ్రీనివాస్ రావు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ భూమి మంతిన అప్పలనాయుడు ఆక్రమణలో ఉందని ఈ విషయంలో రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థలంలోఉన్న చెట్లు నరికేశారని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్‌లో కోరాడు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం చెవడవరం గ్రామానికి చెందిన సభావత్ పద్మబాయి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "తమ సొంత గ్రామంలో సర్వే నెం.155/2లో ప్రభుత్వ అసైన్డ్ భూమిలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, మమ్మల్ని ఆరాధ్యుల సాంబశివరావు అనే వ్యక్తి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కూల్చుతామని బెదిరిస్తున్నారని దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. కడప జిల్లా కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామానికి చెందిన గొడ్ల నాగళ్ల జయకర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "తాళ్ల ప్రొద్దుటూరు పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న మొండి తిరుపతయ్య తమను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తున్నారని వాపోయాడు. కులం పేరుతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నాడు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఉప్పల మూర్తి గోపి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "ఓ ప్రైవేట్ సంస్థ విజయవాడ అను కంపెనీలో సెల్స్ మ్యాన్‌గా పనిచేసే జెండా మహమ్మద్ షఫీవుల్లా అనే అతను ఫెర్టిలైజర్స్ బ్రాంచ్ ఇప్పిస్తానని తన వద్ద రూ.9 లక్షలు తీసుకున్నాడని, కంప్యూటర్స్, ఫర్నీచర్ పేరుతో డబ్బులు తీసుకున్నాడని ఇంత వరకు బ్రాంచ్ ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి పనులు చేయలేదని ఫిర్యాదు చేశారు. ఆ డబ్బులు తమ బంధువులు, స్నేహితుల దగ్గర అప్పు చేసి ఇచ్చాను" ఆ వ్యక్తిపై తగు చర్య తీసుకొని తన డబ్బులు ఇప్పించాలని వేడుకున్నాడు. వీటితోపాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరకున్నారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు వినతి పత్రాలు అందజేశారు.

# శ్రీకాకుళంలో అతిసార కేసులపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్లో వివరాలు తెలుసుకున్న మంత్రి
- తక్షణ వైద్య బృందాల నియామకం, పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశం




శ్రీకాకుళం (చైతన్య రథం): శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసార (డయేరియా) కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలోని గోల్కొండ రేవు, దమ్మల వీధి పరిసర ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలు, రోగుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సమగ్రంగా ఆరా తీశారు. మంత్రి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. తాగునీటి పైపుల్లో మురుగునీరు చేరినట్లయితే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. వార్డుల్లో క్లోరినేషన్ నిర్వహించి, బ్లీచింగ్ పౌడి చల్లే చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. అతిసార రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రత్యేక వైద్య బృందాలను నియమించాలని మంత్రి ఆదేశించారు. అలాగే రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వైద్యులతో కూడా మాట్లాడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

# త్వరలో దివ్యాంగులకు ట్రై స్కూటీలు

## ఇంధన మంత్రి గొట్టిపాటి




అద్దంకి (చైతన్య రథం): దాతల సాయంతో అద్దంకి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఇప్పటివరకు 167 ట్రై స్కూటీలు, ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 7 వేలకు పైగా సైకిళ్లు పంపిణీ చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. సోమవారం అద్దంకి నియోజకవర్గ పర్యటనలో భాగంగా ముప్పవరం క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు 35 ట్రై స్కూటీలను పంపిణీ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 91మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటి వరకు అద్దంకి నియోజకవర్గం లో మొత్తం 167ట్రై స్కూటీలను దివ్యాంగులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పలు వ్యాపార సంస్థల సీఎస్ఆర్ నిధులతో ట్రై స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. నియోజకవ ర్గంలోని పలువురు దివ్యాంగుల నుంచి అప్లికేషన్లు అందినట్లు తెలిపిన మంత్రి గొట్టిపాటి... త్వరలోనే మిగిలిన వారికి కూడా ట్రై స్కూటీలను అందించనున్నట్లు ప్రకటించారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000లకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం సహాయ నిధి ద్వారా అనేక మంది పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. చివరిగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై అధికారులు సత్వరం స్పందించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# గ్రామాల అభివృద్ధికి అర్బన్ అథారిటీ నిధులు

## - అధికారులతో మంత్రి నారాయణ మంతనాలు



అమరావతి (చైతన్యరథం): అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో ఉన్న పంచాయతీల్లో వివిధ రకాల అనుమతుల కోసం మున్సిపల్ శాఖ ఫీజులు వసూలు చేస్తోంది. అయితే ఈ నిధులను గ్రామ పంచాయతీలకు ఏరకంగా ఖర్చు పెట్టాలనే దానిపై నిర్దిష్టమైన నిబంధనలు లేవు. దీంతో గ్రామాల పరిధిలో వస్తున్న నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి ఎలా ఖర్చు చేయాలనే సందిగ్ధత నెలకొంది. ఈ అంశంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై మున్సిపల్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నారాయణ సమీక్ష చేసారు. ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,డైరెక్టర్ సంపత్ కుమార్,టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ హాజరయ్యారు. పంచాయతీలకు చెల్లించాల్సిన ఫీజులను త్వరితగతిన నిర్ధారించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి ముందుకెళ్లాలని సమావేశం అభిప్రాయపడింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి గ్రామాల నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు.

# అంగన్వాడీలకు అండగా ఉంటాం: సంధ్యారాణి

అమరావతి (చైతన్యరథం): అంగన్వాడీ యూనియన్లతో రాష్ట్ర సచివాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భేటీ అయ్యారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను శ్రద్ధగా విన్నారు. అంగన్వాడీల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం సమగ్రంగా పరిశీలన చేస్తుందని హామీ ఇచ్చారు. గతంలో 40 రోజులు ధర్నా చేసిప్పటికీ జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలను పరిశీలిస్తుందని, ానుకూలరీతిలో పరిష్కరిస్తుందని, హామీ ఇచ్చారు. 5000 అంగన్వాడీలను మెయిన్‌లుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ప్రతి సెంటర్‌కూ టీవీ, ఆర్వో ప్లాంట్‌తోపాటు టాయిలెట్ సౌకర్యం కల్పించామన్నారు. 56 వేల మందికి మొబైల్ ఫోన్లు ందజేయడమేగాక యాప్‌లు తగ్గించే ప్రక్రియ అమలు చేసి వత్తిడికు గురి కాకుండా కాపాడామన్నారు. వేసవిలో 15 రోజులు సెలవులు మంజూరు చేశామన్నారు. ఆటవస్తువులు, పాఠాలు చెప్పడానికి వీలుగా చార్టులు, ఇండక్షన్ స్టవ్, నాణ్యమైన వంట పాత్రలు సమకూర్చామన్నారు. రాష్ట్రం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని మంత్రి తెలిపారు. ధర్నాలు సమస్యలకు పరిష్కారాలు కాదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.అంగన్వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.




# విశాఖ స్పోర్ట్స్ అకాడమీకి కోడి రామకృష్ణ పేరు

## - శాప్ ఛైర్మన్ రవినాయుడు వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): శాప్ ఛైర్మన్ రవి నాయుడు అధ్యక్షతన 87వ శాప్ బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం, మౌలిక సదుపాయాల బలోపేతానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై బోర్డు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో క్రీడా అభివృద్ధిని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కొత్తగా రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న క్రీడా అకాడమీలకు నామకరణాలు జరిగాయి. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న ఏపీ స్పోర్ట్స్ అకాడమీకి కోడి రామ్మూర్తి అకాడమీగా పేరు పెట్టారు. కాకినాడలో అకాడమీకి పద్మశ్రీ నందమూరి తారక రామరావు పేరు ఖరారు చేశారు. తిరుపతిలో అకాడమీకి మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, పద్మశ్రీ అవార్డుల గ్రహీత కరణం మల్లేశ్వరి అకాడమీగా నిర్ధరించారు. గుంటూరు అకాడమీకి ఆచార్య నాగార్జున పేరు పెట్టారు. అలాగే కోచ్‌ల సంక్షేమం దృష్ట్యా, రాష్ట్రంలో ఉన్న ఎన్నైఎస్ డిప్లొమా కలిగిన కోచ్‌లకు రూ. 30 వేలకు పారితోషికం పెంచారు. నాన్ ఎన్నైఎస్ డిప్లొమా కోచ్‌లను జూనియర్ కోచ్‌లుగా గుర్తించి వారికి రూ 21,500ల పారితోషికం నిర్ణయిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని బోర్డు నిర్ణయం తీసుకుందని చైర్మన్ రవినాయుడు వెల్లడించారు. అలాగే 2018, రాష్ట్రంలో పలు జిల్లాలో వివిధ క్రీడా విభాగాలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కోచ్‌ల వేతనాలను అందరికీ సమానంగా రూ 21,500లు ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. 2018 నుండి రాష్ట్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల్లో పనిచేస్తున్న 22 మంది కాంట్రాక్ట్, కాంటింజెంట్ సిబ్బందికి పే అండ్ ప్లే పద్ధతిలో జీతాల విడుదల చేయడానికి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి 4 యంగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపింది. 2026 ఆసియా కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ, కోచింగ్, అవసరమైన సహాయం అందించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని ఫిజియోథెరపీ కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజియోథెరపిస్ట్‌ల సేవలను వాలంటరీ ప్రాతిపదికన అన్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల్లో వినియోగించుకునేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ముగింపులో చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, ఈ నిర్ణయాలు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని తెలిపారు. శాప్ 87 వ బోర్డు సమావేశంలో శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి, బోర్డు సభ్యులు రమణ రావు, రజనీ, జగదేశ్వరి, పేరం రవీంద్ర, పీబీఎన్ బుచ్చిరాజు, సంతోష్, బొమ్మినేని శివ, శాప్ ఏవో రామవత్ వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.



# ప్రజాసేవకు ప్రతీక ఎర్రన్నాయుడు

- మహోన్నత నేతకు మనస్ఫూర్తి నివాళి
- ఎర్రన్న జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మంత్రి అచ్చెన్నాయుడు
- ఆయన ఆశయాలు, విలువలు ఎప్పటికీ మార్గదర్శకం
- శ్రీకాకుళం జిల్లాలో పరిశ్రమలు, యువతకు ఉపాధి, ఆర్థికాభివృద్ధి సాధించడమే ఆయన సంకల్పం
- కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు



అమరావతి (చైతన్యరథం): ప్రజాసేవను ఊపిరిగా భావించిన మహోన్నత నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు తనకు అన్నయ్యగానే కాదు, మార్గదర్శకుడిగా, జీవిత దిక్సూచిగా నిలిచారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులతో కలసి ఎర్రన్న విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడిన ఆయన అడుగుజాడల్లో నడవడం తనకు గర్వకారణమన్నారు. అలాంటి మహానేతకు తమ్ముడిగా పుట్టడం తన జీవితంలో అత్యంత అదృష్టమని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, ప్రజాహితం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయ సాధనకే తన ప్రతి శ్వాస అంకితం చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడి నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడంలో ఆయన ప్రత్యేక శైలి ఉండేదని గుర్తుచేశారు. ఢిల్లీలో ఉత్తరాంధ్ర స్వరంగా అభివృద్ధి కోసం ఎర్రన్నాయుడు గళం విప్పారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి న్యాయం జరగాలనే దృఢ సంకల్పంతో ఆయన పోరాడారని చెప్పారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలోనూ ప్రజా సంక్షేమాన్ని ముందుంచుకుని నిర్ణయాలు తీసుకున్న నాయకుడని కొనియాడారు.

### యువతకు రాజకీయ స్ఫూర్తి

ఎర్రన్నాయుడు నాయకత్వం స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది యువకులు రాజకీయాల్లోకి వచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, నిబద్ధత, నిజాయితీ ఆయన వ్యక్తిత్వంలో అంతర్లీనంగా ఉన్నాయని చెప్పారు. ఆయన చూపిన మార్గం ఈ తరానికి ఆదర్శమని అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం ముద్దుబిడ్డగా గల్లీ నుండి ఢిల్లీ వరకు ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళం జిల్లా ఒక కొత్త దిశలో ముందుకెళ్లింది. అభివృద్ధి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటో తన జీవితంతో చూపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం, రైతాంగం కోసం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు అని అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన నేతగా సాగునీరు అందించాలనే తపనతో అహర్నిశలు శ్రమించారన్నారు.

### ఎర్రన్న సోదరుడిగా పుట్టడం నా అదృష్టం

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు భావోద్వేగానికి లోనయ్యారు. గొప్ప వ్యక్తత్వం, ప్రజాహిత నాయకుడికి తమ్ముడిగా పుట్టడం నా జీవితంలో గొప్ప అదృష్టం. ఆయన ఆశయాలు, విలువలు, ప్రజాసేవా దృక్పథం నాకు ఎప్పటికీ మార్గదర్శకం అని అన్నారు. ఎర్రన్నాయుడు ఆశయ సాధన కోసం తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు పరిశ్రమలు రావాలన్నారు. యువతకు ఉపాధి కలగాలన్నారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి జరగాలన్నదే ఎర్రన్నాయుడు సంకల్పమని గుర్తు చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు లోక్‌సభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా ఆయన చేసిన సేవలు ఈ ప్రాంత చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోతాయన్నారు. చివరి క్షణం వరకు ప్రజాసేవలోనే గడిపిన మహానుభావుడు ఆయన అని కొనియాడారు. బలహీన వర్గాల కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన నాయకుడు. రాజకీయాల్లో విలక్షణ నాయకత్వానికి నిదర్శనమన్నారు. టీడీపీ సీనియర్ నేతగా, కేంద్రమంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలంతా ఎర్రన్నాయుడి సేవలను స్మరించుకున్నారు. ఆయన అభివృద్ధి దృక్పథం దూరదృష్టి నాయకత్వం, ప్రజలతో ఉన్న అనుబంధం గురించి కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి మనకు మార్గదర్శకమని, ఆయన ఆశయ సాధనే మన లక్ష్యమని శ్రీకాకుళం అభివృద్ధే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యుడు బగ్గ రమణమూర్తి, కూన రవికుమార్, బెందాళం అశోక్, గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్ ఈశ్వర్ రావు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## కల్తీ పాల ఘటనపై అప్రమత్తం

- బాధితుల వైద్యం ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- సీఎం ఆదేశాలతో జిల్లాలో ఆరోగ్య కమిషనర్ పర్యటన



రాజమహేంద్రవరం (చైతన్య రథం): కల్తీ పాల ఘటనలో ఆస్పత్రుల్లో 12మంది ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ వెల్లడించారు. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న పాల వ్యాపారి 126 కుటుంబాలకు పాలు పోసినట్టు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరినగర్, స్వరూప్ నగర్ కిడ్నీ బాధిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీతో కలిసి వీరపాండ్యన్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు కూడా వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాధితుల వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. సోమవారం కిమ్స్, రెయిన్‌బో ఆసుపత్రులను ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ కీర్తి చేకూరి, ఐజీ జివి అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులతో కలిసి పర్యటించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని వెల్లడించారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందన్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కారణాలపై సాంకేతిక నిపుణుల కమిటీ పరిశీలన కొనసాగుతోందన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా బాధితులకి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పరిస్థితిని పూర్తిగా అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఏదైనా సహాయం కావాలన్న, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060ను సంప్రదించవచ్చని తెలిపారు.

రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారినపడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈనెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో పలువురు వివిధ ఆస్పత్రుల్లో చేరారు.

### ఒక పాల క్యాన్‌లోనే కల్తీ: ఐజీ

కోరుకొండ మండలం నరసాపురంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పర్యటించారు. వరలక్ష్మి పాల కేంద్రాన్ని పరిశీలించారు. ఒక పాల క్యాన్‌లోనే కల్తీ జరిగిందని దర్యాప్తులో తేలిందన్నారు.

### విజయవాడలో నేటినుంచి

## ఏపీ లెజిస్లేచర్ స్పోర్ట్స్

- 24నుంచి 26వరకు నిర్వహణ
- 14 క్రీడాంశాలలో పోటీలు
- శాప్ చైర్మన్ అనిమిని వెల్లడి



విజయవాడ (చైతన్య రథం): ప్రజా ప్రతినిధులమధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెజిస్లేచర్ స్పోర్ట్స్-2026”ను ఘనంగా నిర్వహించనున్నట్టు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. మూడు రోజులపాటు (ఫిబ్రవరి 24, 25, 26) నిర్వహించే లెజిస్లేచర్ స్పోర్ట్స్ 2026 నిర్వహణపై సోమవారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాప్ చైర్మన్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం వేదికలుగా క్రీడలు జరగనున్నాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3:00గంటలకు సభాపతి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా క్రీడా ఉత్సవం ప్రారంభం కానుందన్నారు. 156మంది శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాష్ట్ర మంత్రులు క్రీడలలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మానవ వనరుల మంత్రి నారా లోకేష్ తదితరులు వేడుకలో పాల్గొంటారన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ వంటి మొత్తం 14 రకాల క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నామన్నారు. క్రికెట్‌లో మొత్తం 6 జట్లు పోటీ పడుతున్నాయని. పల్లా శ్రీనివాస్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు కెప్టెన్లుగా వ్యవహరిస్తారన్నారు. అలాగే కబడ్డీలో వాసంశెట్టి సుభాష్, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, బి.సి. జనార్దన్ రెడ్డి, రఘురామకృష్ణం రాజు నేతృత్వంలో నాలుగు జట్లు తలపడతాయన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు క్రికెట్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో చురుగ్గా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటనున్నారన్నారని అన్నారు. మీడియాకు ప్రత్యేక గ్యాలరీ, ప్రత్యక్ష ప్రసార (రాఅజవ) లింకులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు.

శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే ప్రజా ప్రతినిధులకు ఈ క్రీడలు ఒక గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. గెలుపోటములకంటే అందరూ కలిసి ఆడుకోవడం, నవ్వుతూ గడపడమే ఈ క్రీడల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గత ఏడాది నిర్వహించిన క్రీడల విజయవంతం స్ఫూర్తితో, ఈ ఏడాది మరింత ఉత్సాహంగా వీటిని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. శాసనసభ్యులు ఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీని ‘క్రీడా ఆంధ్రప్రదేశ్’గా మార్చాలని పిలుపునిచ్చారన్నారు. గతంలో ఆయన హయాంలోనే గచ్చిబౌలివంటి అంతర్జాతీయ క్రీడా ప్రాంగణాలు నిర్మించబడ్డాయన్నారు. కరోనా తర్వాత శారీరక దృఢత్వంపై అవగాహన పెరిగిందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటితరం యువత సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారని, వారిని శారీరక శ్రమవైపు మళ్లించడానికి క్రీడలే ఏకైక మార్గమని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. శాసనమండలి సభ్యులు బి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ గతంలో పెద్దలు ప్రారంభించిన క్రీడా సంప్రదాయాన్ని తిరిగి కొనసాగించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈవెంట్‌లో మొత్తం 14 రకాల క్రీడా విభాగాలు ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండలి సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

# మహిళా సాధికారతే రాష్ట్రాభివృద్ధికి పునాది

- మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాదు, కార్యాచరణలో చూపుదాం
- అంగన్‌వాడి కార్యకర్తలకు దశలవారీగా వేతనాలు పెంచాలి.
- ఎస్‌జిహెచ్‌ల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అవసరం
- మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్ ప్లేస్ ఏర్పాటు
- శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

అమరావతి (చైతన్య రథం): మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని తద్వారా రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మహిళా సంక్షేమం, అంగన్వాడీ కార్యకర్తల స్థితిగతులపై శాసనసభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచి మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా రుణాలపై సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో అమలుచేసి చూపిస్తున్నామని కూటమి పాలనను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. మహిళ సంక్షేమంపై ప్రభుత్వం కేటాయింపులను రాష్ట్ర భవిష్యత్తుపై పెడుతున్న పెట్టుబడిగా అభివర్ణించారు.



అంగన్వాడీ సమస్యలపై మాట్లాడుతూ కార్యకర్తలకు ఏడాదిలో కనీసం 30 రోజుల చెల్లింపు వేసవి సెలవులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు పదవీ విరమణ సమయంలో తగిన గ్రాట్యుటీ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘ కాల సేవ చేసినా వారి భవిష్యత్‌కు భద్రత లేదన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాట్యుటీ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో ప్రస్తుత గౌరవ వేతనం సరిపోవడం లేదని, కనీస వేతన చట్టంకింద దశలవారీగా వేతనాలు పెంచాలన్నారు. అలాగే, స్వయం సహాయక సంఘాల బలోపేతం దిశగా ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ ఎగుమతి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్‌ప్లేస్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం, వృత్తి భరోసా కల్పించడంతోపాటు సామాజికంగా, రాజకీయంగా బలపరచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు.

# అనూరియా కేసులపై మంత్రి కందుల ఆరా

### బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం



అమరావతి (చైతన్యరథం): రాజమహేంద్రవరంలో ప్రజలను కలవరపెడుతున్న అనూరియా (మూత్ర విసర్జన నిలిచిపోవడం) కేసుల పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. ఈ పరిస్థితిపై ఆయన సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్లో సమీక్ష నిర్వహించారు. బాధితులందరికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని సూచించారు. ఇప్పటికే ప్రత్యేక వైద్య బృందాల ద్వారా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ద్వారా ఈ సమస్యకు మూల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. కల్తీ పాల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# ‘ఏకసభ్య కమిటీ’ పూర్తిగా చట్టబద్ధం

- సుప్రీం తీర్పుతో వైసీపీ విష ప్రచారం బట్టబయలు
- వైసీపీ ప్రయోజనాల కోసమే సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్

అమరావతి (చైతన్య రథం): తిరుమల తిరుపతి దేవస్థానం నెయ్యి కొనుగోలులో జరిగిన పరిపాలనాపరమైన లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీని సవాల్ చేస్తూ డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమని టీడీపీ అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో, ఈ కమిటీ ఏర్పాటుపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం మరోసారి బట్టబయలైందని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన సిబిఐ-సిట్ టీటీడీ నెయ్యి కల్తీ వ్యవహారంపై లోతైన విచారణ జరిపి, ఇప్పటికే ప్రభుత్వానికి ‘సెల్ఫ్ కంటైన్డ్ నోట్’ సమర్పించింది. నివేదికలో పేర్కొన్న సిఫార్సుల మేరకు, గత ప్రభుత్వ హయాంలో నెయ్యి కొనుగోలు నిబంధనల సడలింపులో జరిగిన పరిపాలనాపరమైన వైఫల్యాలను, అధికారుల బాధ్యతారాహిత్యాన్ని గుర్తించేందుకు మాత్రమే ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించిందని అన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి గతంలోనూ తిరుపతి కోర్టులో వైసీపీకి అనుకూలంగా దేవస్థానంమీద, పింక్ డైమండ్ విషయంలోనూ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పుడు సుప్రీంకోర్టులోనూ పిటిషన్లు వేయడం కేవలం వైసీపీ ప్రయోజనాలను కాపాడేందుకేనని స్పష్టమవుతోందని నీలయపాలెం పేర్కొన్నారు. టీటీడీని అప్రతిష్టపాలు చేస్తూ, విచారణను అడ్డుకోవడమే లక్ష్యంగా పిటిషన్లు వేశారని ఆరోపించారు. పరిపాలనాపరమైన విచారణను



నిలిపివేయాలని చూడటం ద్వారా అసలైన నిందితులను కాపాడాలనే కుట్ర ఇందులో దాగుందని విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు.

“సుబ్రహ్మణ్య స్వామికి.. టీడీపీకి వ్యతిరేకంగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం కొత్తమీ కాదు. 2018లో పింక్ డైమండ్ మరియు ఆర్థిక ఆడిట్ పిటిషన్లు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో, టీటీడీ బోర్డును సవాలు చేయడంలో సుబ్రహ్మణ్యస్వామి చాలా చురుగ్గా ఉండేవారు. అక్టోబర్ 2018లో, ఆయన హైదరాబాద్ హైకోర్టులో ఒక పిల్ దాఖలు చేశారు. టీటీడీని రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ నుండి “విముక్తి” చేయాలని, అప్పటి ముందు మూడేళ్ల టీడీపీ హయాం ఆర్థిక వ్యవహారాలపై భారీ ఆడిట్ జరపాలని అందులో కోరారు. అదే 2018లో ఆలయ ఆభరణాల్లోని ఒక పింక్ డైమండ్ కనిపించడం లేదని, మరమ్మతుల సమయంలో అది దొంగిలించబడిందని లేదా పగిలిపోయిందని ఆరోపించారు. ఇది అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్సీపీకి చంద్రబాబు నాయుడుపై ఒక బలమైన రాజకీయ అస్త్రంగా మారింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతా ఆ పింక్ డైమండ్ గురించి ప్రస్తావించనే లేదు. 2020లో జగన్ ప్రభుత్వంలో స్వామి వైఖరి బోర్డును సవాలు చేయడం నుండి బోర్డుతో సహకరించడంవైపు మళ్లింది. సెప్టెంబర్ 2020లో, జగన్ మోహన్‌రెడ్డి తన విన్నపాన్ని మన్నించి టీటీడీ నిధులపై కాగ్ ఆడిట్‌కు గ్రేస్‌ఫుల్‌గా అంగీకరించారని స్వామి స్వయంగా ట్వీట్ చేశారు. ఆలయాన్ని ప్రభుత్వం నుండి విముక్తి చేయడం కోసం పోరాడటానికి బదులుగా, ఆయన వైవి సుబ్బారెడ్డి నేతృత్వంలోని బోర్డుతో కలిసి పనిచేశారు. 2014-2019 (టీడీపీ హయాం) నాటి ఆర్థిక వ్యవహారాలపై తిరిగి ఆడిట్ ప్రారంభించేలా చేశారు. ఇది గత టీడీపీ ప్రభుత్వ నిర్వహణ లోపాలను చట్టబద్ధంగా నిరూపించడానికి చేసిన ఉమ్మడి ప్రయత్నంగా పరిగణించబడింది. కానీ ఏదీ నిరూపించలేకపోయారు” అని దుయ్యబట్టారు.

2021లో, తిరుమలలో మిషనరీ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలను అవహేళన చేసే నివేదికలుగా పేర్కొంటూ, టీటీడీ పరిపాలనను రక్షించడానికి స్వామి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. హిందూ సంఘాలు మరియు టీడీపీ నుండి ఒత్తిడి ఎదుర్కొంటున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి ఇది ఒక ముఖ్యమైన చట్టపరమైన మద్దతుగా నిలిచింది.

తాజాగా ఫిబ్రవరి 21, 2026లో సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో.. దినేష్‌కుమార్ వన్‌మ్యాన్ కమిషన్‌ను లక్ష్యంగా చేసుకుంటూ కొత్త పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ (సిట్-ఇందులో సీబీఐ కూడా ఉంది) ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నందున, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక “సమాంతర” వన్‌మ్యాన్ కమిటీని నియమించలేదని ఆయన వాదించారు. వైఎస్సార్సీపీ కష్టాల్లో ఉన్నప్పుడల్లా స్వామి మరోసారి వారికి “రక్షణగా” వస్తుంటారు. సిట్ నేరపూరిత కోణాన్ని (క్రిమినల్ సైడ్) దర్యాప్తు చేస్తుంటే, దినేష్‌కుమార్ కమిటీ పరిపాలనాపరమైన ప్రక్షాళన (కరప్ట్ అధికారులను తొలగించడం) చేపడుతుంది. ఈ కమిటీని ఆపడానికి ప్రయత్నించడంద్వారా, జగన్ హయాంలో నియమితులైన “అంతర్గత” అధికారులను తొలగించకుండా స్వామి అడ్డుకుంటున్నారని స్పష్టమవుతోంది.

వైఎస్సార్సీపీ ఎప్పుడు ఇబ్బందుల్లో ఉన్నా, డాక్టర్ స్వామి ఒక పిటిషన్‌తో రావడం విచిత్రంగా అనిపిస్తుంది. 2018లో జగన్‌రెడ్డి ఎన్నికల్లో గెలవడానికి ‘పింక్ డైమండ్’ అనే అబద్ధాన్ని ప్రచారం చేశారు. 2020లో వైఎస్సార్సీపీ బోర్డుతో చేతులు కలిపారు. ఇక నేడు, లడ్డూను అపవిత్రం చేసిన అవినీతి అధికారులను తొలగించడానికి టీడీపీ ప్రయత్నిస్తుంటే, ఆయన మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్లి దినేష్‌కుమార్ కమిటీని ఆపాలని చూస్తున్నారు. ఇది శ్రీవారికి ద్రోహం చేసిన పార్టీకి చట్టపరమైన రక్షణ కల్పించే ఒక స్పష్టమైన వ్యూహం.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కేవలం పరిపాలనాపరమైన లోపాలను మాత్రమే పరిశీలిస్తుంది. ఒకవేళ గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉంటే, వైసీపీ ఎందుకు భయపడుతోంది? సిట్ తన నేర పరిశోధన పూర్తి చేసింది. ఇప్పుడు జరగాల్సింది బాధ్యులపై శాఖాపరమైన చర్యలు అని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు నియమించిన సిట్ స్వయంగా సిఫార్సు చేసినప్పుడు, ఆ నివేదికలోని అంశాలను పరిశీలించి కమిటీ వేసే పూర్తి హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని సుప్రీంకోర్టు సైతం ధ్రువీకరించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఈ విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన శక్తులపై చట్టపరమైన, పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయదని నీలాయపాలెం విజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

# ఎర్రంన్నాయుడు స్ఫూర్తిని కొనసాగించాలి

**● ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎర్రన్న సేవలు చిరస్మరణీయం : మామిడి**



పాతపట్నం (చైతన్యరథం): యువనాయకులు, కార్యకర్తలు దివంగత ఎర్రంన్నాయుడు పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. సోమవారం మాజీకేంద్ర మంత్రి కింజరాపు ఎర్రంన్నాయుడు 69వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రంన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన మామిడి గోవిందరావు... ఆయన సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎర్రంన్నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుండి ఎదిగి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన గొప్ప ప్రజానాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ప్రజాసేవలో నిబద్ధత, పార్టీ పట్ల కట్టుబాటు, అభివృద్ధి పట్ల దృఢ సంకల్పం వంటి లక్షణాలు ప్రతి ప్రజాప్రతినిధి ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలతో పాటు కింజరాపు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమస్యలపై గళమెత్తిన విప్ జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల్లో గిరిజన సంక్షేమంపై ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి సోమవారం మాట్లాడారు. గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, జీసీసీ ద్వారానే అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు జరగాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 544 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జీవో నెం.3ను పునరుద్ధరించాలని కోరారు. ఐటీడీఏ ద్వారా జీవీవీకే ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్, రచ్చబండల నిర్మాణం చేపడితే ప్రజలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయని, రహదారుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. అటవీ హక్కుల చట్టం (ఆర్ ఎఫ్), పీసా చట్టం, భూబదలాయింపు, ఎన్టీఆర్ వంటి అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.

# రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం



కురుపాం (చైతన్యరథం): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కడ్రక మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం కురుపాం మండలంలోని పలు గిరిజన గ్రామాలకు నూతనంగా మంజూరైన బీటీ రహదారులకు శంకుస్థాపన చేశారు. కొండలేవిడి నుంచి కొనపాడుకు రూ.3 కోట్ల నిధులతో 2.8 కిలోమీటర్లు, గాంధీనగర్ నుంచి డి. భారామణికు రూ.2.6 కోట్ల నిధులతో 2.6 కిలోమీటర్లు బీటీ రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఏజెన్సీలో గిరిశిఖర ప్రాంతాల్లో సైతం రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు.

# కువైట్‌లో చిక్కుకున్న ఏపీ మహిళ

తన కుటుంబం, బిడ్డల భవిష్యత్తు బాగుండాలని ఆశపడి అందరిని వదిలి కువైట్‌కు వెళ్లింది. అక్కడికి వెళితే కడుపు నిండా తిండి లేదు, కంటినిండా కునుకు లేదు. నా అనే వారు లేకపోవడంతో నిత్యం నరకం చూపించారు ఆమె యజమానులు. ఏడాదిన్నర క్రితం ఆమె తల్లిదండ్రులు చనిపోవడంతో స్వదేశానికి వచ్చేందుకు ప్రయత్నించినా ఇంటి యజమానులు నిరాకరించారు. పాస్‌పోర్టు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. చివరికి ఆమెపై దొంగతనం నేరం మోపి జైలుకు పంపించారు. కోర్టు నిర్దోషిగా విడుదల చేసినా సొంతూరుకు రాలేక అష్టకష్టాలు పడుతోంది. ప్రస్తుతం ఆ దేశపు అంబాసిలో తలదాచుకుంది.

# మహోన్నత నేతకు మనస్ఫూర్తి నివాళి

**●కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మంత్రి అచ్చెన్నాయుడు**

**● కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు**



అమరావతి (చైతన్యరథం): ప్రజాసేవను ప్రాణంగా భావించిన మహోన్నత నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు గారు తనకు అన్నయ్యగానే కాదు, మార్గదర్శకుడిగా, జీవితానికి దిక్సూచిగా నిలిచారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం దివంగత నేత ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులతో కలసి ఎర్రన్నాయుడు విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడిన ఆయన అడుగుజాడల్లో నడవడం తనకు గర్వకారణమని, అలాంటి మహానేతకు తమ్ముడిగా పుట్టడం తన జీవితంలో అత్యంత అదృష్టమని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, ప్రజాహితం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయ సాధనకే తన ప్రతి శ్వాస అంకితం చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడంలో ఆయన ప్రత్యేక శైలి ఉండేదని గుర్తుచేశారు. ఢిల్లీలో ఉత్తరాంధ్ర స్వరంగా అభివృద్ధి కోసం ఎర్రన్నాయుడు గళం విప్పారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి న్యాయం జరగాలనే దృఢ సంకల్పంతో ఆయన పోరాడారని చెప్పారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలోనూ ప్రజా సంక్షేమాన్ని ముందుంచుకుని నిర్ణయాలు తీసుకున్న నాయకుడని కొనియాడారు.

**రాజకీయాల్లోకి స్ఫూర్తి నిచ్చిన మహానేత**

ఎర్రన్నాయుడు నాయకత్వం స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది యువకులు రాజకీయాల్లోకి వచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, నిబద్ధత, నిజాయితీ ఆయన వ్యక్తిత్వంలో అంతర్లీనంగా ఉన్నాయని చెప్పారు. ఆయన చూపిన మార్గం ఈ తరానికి ఆదర్శమని అభిప్రాయపడ్డారు.

**అలాంటి మహానేత నా అన్నగా ఉండటం నా అదృష్టం**

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ, అలాంటి గొప్ప, ప్రజాహిత నాయకుడు నా అన్నగా ఉండటం నా జీవితంలో గొప్ప అదృష్టం. ఆయన ఆశయాలు, విలువలు, ప్రజాసేవా దృక్పథం నాకు ఎప్పటికీ మార్గదర్శకం అని అన్నారు. ఎర్రన్నాయుడు ఆశయ సాధన కోసం తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలంతా ఎర్రన్నాయుడు సేవలను స్మరించుకున్నారు. ఆయన అభివృద్ధి దృష్టి, దూరదృష్టి నాయకత్వం, ప్రజలతో ఉన్న అనుబంధం గురించి కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, బెందాలం అశోక్, గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్ . ఈశ్వర్ రావు,తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో డయేరియా కలకలం... అధికారులకు మంత్రి నారాయణ కీలక ఆదేశాలు



శ్రీకాకుళం (చైతన్యరథం): జిల్లాలో డయేరియా కేసులు నమోదు కావడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్‌తో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడి తాజా పరిస్థితిని సమీక్షించారు. డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణాలు ఏంటి? కలుషిత నీరా లేదా ఇతర ఆహారపు అలవాట్లా? అనే కోణంలో తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**మెరుగైన వైద్యం అందించాలి..**

వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సాయం అందించాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యాధి మరింత విస్తరించకుండా ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి నాణ్యతను తనిఖీ చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

**అధికారుల సూచనలు..**

తాగునీటిని కాచి, వడపోసి చల్లార్చిన తర్వాతే తాగాలని అధికారులు సూచించారు. ఆహారంపై ఈగలు వాలకుండా జాగ్రత్త పడాలని, బయటి ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సీఎం పర్యాటన ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



చీపురుపల్లి (చైతన్యరథం): చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీలో పైలపేట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లబ్దిదారులకు పింఛన్లు అందజేయడానికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్కు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. అనంతరం కలెక్టర్ పైలపేట గ్రామంలోని పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్. చీపురుపల్లి ఆర్డీవో ప్రమీల గాంధీ, డీఎస్పీ ఎన్ రాఘవులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# ప్రజలు భయాందోళన చెందవద్దు

**●పరిస్థితిని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**●ఫిర్యాదులకై హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060ను సంప్రదించవచ్చు**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు భయాందోళన చెందవద్దని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. వై జంక్షన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత కేసులు నమోదైన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని తెలిపారు. జిల్లా పరిపాలన, వైద్య ఆరోగ్య, ఆహార భద్రత, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక ప్రతిస్పందన బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. డయాలసిస్ అవసరమైన మూత్రపిండ సమస్యలతో ఇప్పటివరకు 12 మంది నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేరగా, వీరందరికీ ఒకే పాలవ్యాపారి పాలు సరఫరా చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆ వ్యాపారి పాలు సరఫరా చేసిన 106 ఇళ్లలోని కుటుంబాలకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వీరందరికీ నిరంతర పర్యవేక్షణతో తగిన వైద్యసేవలు అందిస్తామని స్పష్టం చేశారు. పశు సంవర్ధక శాఖ ద్వారా 46 పశువులకు పరీక్షలు నిర్వహించి నమూనాలను వైజ్ఞానిక మరియు పశుసంవర్ధక శాఖ ప్రయోగశాలలకు పంపినట్లు తెలిపారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు తదితర పాల ఉత్పత్తులను హైదరాబాద్ మరియు విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పంపినట్లు వెల్లడించారు. నివేదికలు అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా స్పందించి, ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై సమగ్ర నివేదికను కోరినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ప్రజల్లో అపోహలు వ్యాపించకుండా సమగ్ర అవగాహన కల్పించాలని, అవసరమైన అన్ని వనరులు వినియోగించాలన్న దిశగా సూచనలు అందించినట్లు చెప్పారు. కాబట్టి ప్రజలు భయాందోళన చెందవద్దని, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కేసులకు సంబంధించి హెల్త్ బుల్లెట్‌ను అధికారికంగా విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ఘటన దురదృష్టకరం... బాధాకరం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా
- బాధితులకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది
- రిపోర్టు వచ్చాక కఠిన చర్యలు ఉంటాయి
- ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు... రుడా చైర్మన్ బొడ్డు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): చౌడేశ్వరనగర్లో అనురియా, మూత్రపిండాలు ఫెయిల్ అవ్వడం వలన బాధితులు వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అయితే అనూరియా కేసులపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కల్తీ పాల ఘటనకు సంబంధించి 4 గురు వృద్ధులు మరణించడం దురదృష్టకరం, చాలా బాధాకరం అని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బొల్లినేని, రెయిన్ బో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నవారిని రుడా చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరితో కల్సి ఎమ్మెల్యే వాసు పరామర్శించారు. బాధిత కుటుంబాలను, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరి నగర్లో కూటమి నాయకులతో కలిసి ఏర్పాటు మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం 10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు చెప్పారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు వైద్య పరంగా అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఎంత ఖర్చు అయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రెయిన్బో హాస్పిటల్ అత్యున్నత సాంకేతికత అందించేందుకు విజయవాడ నుండి ఎక్విప్మెంట్ తీసుకువచ్చారని ఆయన తెలిపారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని ఆయన చెప్పారు. వరలక్ష్మి మిల్క్ డైరీ ద్వారా పాలు సరఫరా చేసినట్లు తెలుస్తోందని, ఇప్పటికే పాలవ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వివరాలు సేకరిస్తున్నారని ఆయన వివరించారు. సమస్య మొదలైన 24 గంటల్లోనే ప్రభుత్వం టీం అంతా ఫీల్డ్‌లో ఉండి పర్యవేక్షణ చేస్తోందని ఎమ్మెల్యే వాసు చెప్పారు.

# కాపుల మధ్య చిచ్చుపెట్టే చర్యలకు ముద్రగడ స్వస్తి పలకాలి



**●బూతు నేత అంబటి రాంబాబును పరామర్శించడమా? బడేటి**

ఏలూరు (చైతన్యరథం): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన కులాన్ని రెడ్డిగా మార్చుకున్న తర్వాత ఇంకా కాపుల ప్రతినిధిగా ఎలా మాట్లాడతారంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నిలదీశారు. ఇదంతా కేవలం ఏకతాటిపై నడిచే ప్రయత్నంలో ఉన్న కాపుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలేనంటూ ఆయన కొట్టిపడేశారు. వైసీపీ నేత అంబటి రాంబాబును పరామర్శించిన అనంతరం ముద్రగడ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బడేటి చంటి తనదైన శైలిలో స్పందించారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కాపు నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసుల్లో జైలు నుండి విడుదలైన వైసిపి నేత అంబటి రాంబాబును పరామర్శించిన సమయంలో ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యాలు సరికాదన్నారు. అంబటి ఏమైనా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తా అంటూ ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ముద్రగడ తన చేష్టలతో విలువ పూర్తిగా కోల్పోయారన్నారు. టీడీపీ హయాంలో ముద్రగడకు మంత్రి పదవి లభించడం వల్లే ఆయనకు గుర్తింపు లభించిందన్న ఎమ్మెల్యే చంటి... ఇప్పుడు ఆ పరిస్థితిని మర్చిపోయి వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. 2019 నుండి 24 మధ్యకాలంలో వైసిపి ప్రభుత్వ హయాంలో కాపుల కోసం ముద్రగడ ఏం ఉద్యమాలు చేశారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాపులపై నిజమైన ప్రేమ కనపరుస్తోన్న సిఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌లు, కాపుల సంక్షేమానికి సుస్థిరబాటలు వేస్తున్నారని వెల్లడించారు. ఈ తరుణంలో కాపుల మధ్య చిచ్చుపెట్టే చర్యలకు స్వస్తిపలకాలని ఎమ్మెల్యే చంటి హితవు పలికారు.

# నియోజవర్గంలో ప్రధాన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టండి

**●ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్**



చింతలపూడి (చైతన్యరథం): నియోజకవర్గంలో గడిచిన రెండు దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని ప్రధాన వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించాలని సోమవారం సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబుని ఎమ్మెల్యే రోషన్ కుమార్ కోరారు. జంగారెడ్డిగూడెం మండలం జంగారెడ్డిగూడెం నరసన్నపాలెం ప్రధాన రహదారిపై బైనేరు వంతెన మరియు శ్రీనివాసపురం- పందిరి మామిడిగూడెం నడుమ పట్టణ పాలెం వంతెన, కామవరపుకోట లింగపాలెం మండలాలను కలిపి గుండేరు వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు తక్షణమే చర్యలు చేపడతామని కృష్ణ బాబు పానుకూలంగా స్పందించారు.

# బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో కల్తీ పాల ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యంగా చిన్నారులు విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి నగరంలోని రెయిన్ బో హాస్పిటల్... బొల్లినేని ఆసుపత్రిలలో చికిత్స పొందుతున్న బాధితులను వారు పరామర్శించారు. రెయిన్ బో ఆసుపత్రి, బొల్లినేని ఆసుపత్రిలోని ఐసియులో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే వాసు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని మందులను అందుబాటులో ఉంచాలని వైద్యులను కోరారు. అస్వస్థతకు గురైన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ప్రభుత్వం మరియు యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# మైనారిటీల పక్షపాతి కూటమి ప్రభుత్వం

**●బడ్జెట్‌లో మైనారిటీలకు అధిక ప్రాధాన్యం**

**●సీఎం, మైనారిటీ శాఖ మంత్రికి ధన్యవాదాలు**

**●అసెంబ్లీలో గళం వినిపించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): మైనారిటీల అభ్యున్నతి, ఆర్థిక అభివృద్ధికి అహర్నిశలు పాటుపడే గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్.. మరోసారి అసెంబ్లీ సాక్షిగా ముస్లిం మైనారిటీ కోసం గళం వినిపించారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్ లో మైనారిటీలకు కేటాయించిన నిధులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతూనే మరో వైపు మైనారిటీలకు మరిన్ని పథకాలు, అవసరాల గురించి సభలో ప్రస్తావించారు. మైనారిటీల సంక్షేమం, న్యాయశాఖ అనే అంశంపై సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణం ఆవశ్యకత వివరిస్తూనే మైనారిటీల కోసం విద్య, ఉపాధి, రివాల్వింగ్ ఫండ్ వంటి అంశాలకు బడ్జెట్ లో కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 78 గురుకులాలకు నిధులు నిలిపేస్తే ప్రస్తుత బడ్జెట్ లో రూ.200 కోట్లు కేటాయించారని చెప్పారు. మైనారిటీలకు ఉన్నత విద్య అందించేందుకు అబ్దుల్ కలాం విదేశీ విద్య పథకం ద్వారా రూ.20 కోట్లు కేటాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని మూలనపడేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కారని గుర్తు చేశారు. జనవికాస్ యోజన పథకాన్ని గత వైసీపీ నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం రాష్ట్ర గ్రాంట్ కేటాయించి 120 పథకాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. మైనారిటీ హాస్టల్ విద్యార్థుల కోసం నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కోటి రూపాయలు రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని, ఈ ఫండ్ మరికొంత పెంచాలని విన్నవించారు. ఉర్దూను ద్వితీయ లాంగ్వేజ్ గా గుర్తించడంతోపాటు ఉర్దూ ఘర్ లు, షాదీఖాలను నిధులు కేటాంచారన్నారు. సెంటర్ ఫర్ డెవపల్ మెంట్ మైనారిటీస్ డెవలప్ మెంట్ కు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. దీంతోపాటు దూదేకుల అభ్యున్నతికి రూ.50 కోట్లు కేటాయించారన్నారు.

# జైన్ సాధువుల ఆశీస్సులు పొందిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): గురునానక్ కాలనీలోని జైన్ తేరాపంత్ భవన్‌కు విచ్చేసిన జైన్ తేరాపంత్ ఆచార్య మహాశ్రమణ్ శిష్యులు రష్మీమునిశ్రీ, శివయుష్ మునిశ్రీలను సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. రాజస్థాన్ నుంచి దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తూ విజయవాడకు చేరుకున్న జైన్ సాధువులను ఎంపీ కేశినేని శివనాథ్ జైన్ తేరాపంత్ భవన్‌లో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాధువులు అహింస, సద్గుణాలు, దురాలవాట్ల నివారణపై ఆధ్యాత్మిక బోధనలు అందించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... సమాజంలో నైతిక విలువల పెంపొందనకు జైన్ సాధువుల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. వారి పాదయాత్రలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంచుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జైన్ సమాజ ప్రముఖులు దినేష్ జైన్, శ్యామ్ సుఖా, జగదీష్ జైన్, మనోజ్ పుగ్లియా, రాజ్‌కుమార్ బైద్, సంగీత దుగర్, సందీప్ కోఠారి, టీడీపీ నాయకులు పీతా బుజ్జిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మటన్ మార్కెట్‌కు శాశ్వత తాగునీటి సౌకర్యం

◆ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో సమస్యకు పరిష్కారం



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం మటన్ మార్కెట్‌లో ఏళ్ల తరబడి నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్న 19 మంది దుకాణదారులు నీటి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యతని చెబుతూ, వెంటనే అధికారులతో మాట్లాడి మార్కెట్ వరకు పైప్‌లైన్ పనులు పూర్తి చేయించి తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా గన్నవరం టౌన్ టీడీపీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌ను దుకాణదారులు సన్మానం చేశారు. చిరకాల వాంఛను నెరవేర్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కేవలం వినతి పత్రం ఇచ్చిన కొద్ది రోజుల్లోనే పైప్‌లైన్ పనులు పూర్తి కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా నిర్ణయాలు తీసుకునే యార్లగడ్డ వెంకట్రావు వంటి నాయకులు ఉండటం గన్నవరం నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఈ సందర్భంగా వ్యాపారులు కొనియాడారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, జాస్తి శ్రీధర్‌కు మరియు సహకరించిన పంచాయతీ అధికారులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

● టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): పార్టీకి ప్రాణం, నాయకత్వానికి బలం కార్యకర్తలని బూత్ నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ జెండాను గర్వంగా ఎగరేసేది, ప్రజల మధ్య పార్టీ భావజాలాన్ని తీసుకెళ్లేది కార్యకర్తలేనని అటువంటి తాము ఎప్పుడు అండగా ఉంటామని టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 19వ డివిజన్ జార్జిపేట ఏరియాలో గద్దె క్రాంతి కుమార్ పర్యటించి, పార్టీ కార్యకర్త వల్లభదాసు శాయమ్మ మనవరాలు వల్లభదాసు వినీతకు కాలేజీ ఫీజులు నిమిత్తం 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని గద్దె క్రాంతి సొంత నిధులు నుంచి అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలోనూ, సాధారణ రోజుల్లోనూ, ప్రజా సమస్యలపై పోరాటాల్లోనూ ముందుండేది కార్యకర్తలే అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. కార్యకర్తకు కష్టం వస్తే అది పార్టీకి వచ్చిన కష్టంగా భావిస్తూ ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, అనుకోని పరిస్థితులు --ఏదైనా ఎదురైనా ముందుండి సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు. కార్యకర్త కుటుంబం సురక్షితంగా, బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్నారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్త గౌరవం కాపాడటం, వారి కృషిని గుర్తించడం, అవసరమైన సమయంలో తోడుగా నిలవడం నాయకులు బాధ్యత అన్నారు.

# బొల్లా నీ అసత్య ఆరోపణలు కట్టిపెట్టు

◆వినుకొండకు సీఎం వరాలు ప్రకటిస్తే జీర్ణించుకోలేక విమర్శలా?

◆ కోట్లు విలువచేసే ఎన్ఎస్పి స్థలాన్ని 2019లో మున్సిపాలిటీకి అప్పగించింది చీఫ్ విప్ జీవి

◆ సొంత భూములకు ప్రజాధనంతో రోడ్లు వేసుకొని మోసం చేసిన బ్రహ్మనాయుడు




వినుకొండ (చైతన్యరథం): స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు వరాలు ప్రకటిస్తే జీర్ణించుకోలేక బొల్లా బ్రహ్మనాయుడు మతిభ్రమించి అసత్య ఆరోపణ చేయడం సరికాదని టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, షమీంఖాన్, మీసాల మురళి, రాపర్ల జగ్గారావు, పల్లె మీసాల దాసయ్యలు మాట్లాడారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినుకొండ అభివృద్ధికి పాటుపడుతుంటే బొల్లా బ్రహ్మనాయుడు అక్కస్‌తో చేస్తున్న విమర్శలు నియోజకవర్గ ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు. వినుకొండ పట్టణానికి శాశ్వతంగా త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నాడు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అప్పటి కేంద్ర మున్సిపల్ శాఖ మంత్రి వెంకయ్య నాయుడు వద్దకు వెళ్లి నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. వినుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి, ఆదాయాన్ని పెంచేందుకు కోట్లు విలువచేసే 21.22 ఎకరాల ఎన్ఎస్పి స్థలాన్ని మున్సిపాలిటీకి బదలాయింపజేసి, అభివృద్ధికి 146 జీవోను 2019లో తీసుకువచ్చింది జీవీ ఆంజనేయులు అని చెప్పారు. వినుకొండకు 100 పడకల ఆసుపత్రి ప్రతిపాదన చేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అని స్పష్టం చేశారు. అలాగే పట్టణ శాశ్వత త్రాగునీటి పథకానికి 210 కోట్లు నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. మా నాయకుడు జీవి ఆంజనేయులుపై అసత్య ఆరోపణలు, నిరాధారణమైన విమర్శలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.

# బీసీ భవన నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలి : గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): వెలగపూడి అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో "బీసీ సంక్షేమం" పై జరిగిన చర్చలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్న నేపథ్యంలో, గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన బీసీ భవన నిర్మాణాన్ని ఈ బడ్జెట్‌లోనే వేగవంతంగా ప్రారంభించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. ఏ దేశ ప్రగతైనా ఆ దేశంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్న గళ్ళా మాధవి, బీసీ సంక్షేమానికి కేటాయించిన ?51,021 కోట్ల నిధులు కేవలం సంఖ్యలు కాదని, అవి బీసీల ఆత్మగౌరవ పత్రంగా భావించవచ్చని అన్నారు. 2025--26 సంవత్సర కేటాయింపుతో పోలిస్తే ఈసారి భారీ పెరుగుదల చూపడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. బీసీల ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఆదరణ 3.0 కింద రూ.1000 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.600 కోట్లు, బీసీ వసతి గృహాల పురోగతికి దాదాపు రూ.300 కోట్లు, ఎన్టీఆర్ విదేశీ విద్యాధరణ పథకం కింద రూ.3838 కోట్ల కేటాయింపులు చేయడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీల అభివృద్ధిని ఎప్పటికీ ప్రాధాన్యంగా తీసుకున్నారని, తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక అన్న విశ్వాసంతో ఎన్నో పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. బీసీ భవనాలు కేవలం నిర్మాణాలు కాదని, అవి ఆయా వర్గాల ఆత్మగౌరవానికి, సామాజిక వికాసానికి ప్రతీకలని తెలిపారు.

# పేదల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే పీ-4లక్ష్యం



గుడివాడ (చైతన్యరథం): పేదల ఆర్థికస్థితిని మెరుగు పర్చడమే పి-4 కార్యక్రమ ప్రధాన లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పి-4 కార్యక్రమంలో భాగంగా మూగ చెవిటి వాడైనా గుడివాడ బాపూజీ నగకు చెందిన 8ఏళ్ల చిన్నారి మహమ్మద్ రసూల్‌కు, ఎన్నారై వీర్నాల బాలాజీ దాతృత్వంతో సమకూర్చిన రూ.55 వేల విలువచేసే వినికిడి యంత్రాన్నీ ప్రజావేదిక కార్యాలయంలో చిన్నారికి సోమవారం ఎమ్మెల్యే రాము అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... దార్శనికులు సీఎం చంద్రబాబు ఆలోచనలో నుంచి పి-4 ఉద్భవించిందన్నారు. సంపద కలిగిన కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలబడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదల సాధికారత కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఉన్నత కుటుంబాల వారంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పేద కుటుంబాలను ఆదుకుంటున్న దాతలను ఎమ్మెల్యే రాము అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మిర్చియార్డ్ నూతన ఛైర్మన్‌కు ఏపీ టీఎస్ ఛైర్మన్ శుభాకాంక్షలు



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు మిర్చియార్డ్ అభివృద్ధికి టెక్నాలజీ పరంగా ఏపీటెక్నాలజీ సర్వీసెస్ పూర్తి సహకారం అందిస్తుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కుర్ర అప్పారావుకి, డైరెక్టర్లకు అభినందనలు తెలియజేసిన మన్నవ మోహనకృష్ణ... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిజిటల్ సదుపాయాలు, పారదర్శక వ్యవస్థలు, ఆధునిక టెక్నాలజీ ద్వారా మిర్చి యార్డ్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు. అలాగే గుంటూరు మిర్చిని అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేయడంలో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. కుర్ర అప్పారావు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన విషయంపై స్పందిస్తూ, ఆ రోజున హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలిసి ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లడంతో ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కాలేకపోయానని తెలిపారు. మిర్చియార్డ్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కుర్ర అప్పారావుని మన్నవ మోహనకృష్ణ కోరారు.

# 25న ముఖ్యమంత్రి పర్యటనకు భారీ ఏర్పాట్లు

### మార్కాపురంలో మహాసభ - వెలుగొండ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన





పొదిలి, (చైతన్యరథం): ఈనెల 25న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం ప్రాంతంలో విస్తృత పర్యటన చేపట్టనున్నారు. మార్కాపురంలో నిర్వహించనున్న బహిరంగ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పొదిలి పట్టణంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల ముఖ్య నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల భారీ తరలింపు, వాహనాల ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ, మార్కాపురం జిల్లాను ప్రకటించి ప్రాంత అభివృద్ధికి నూతన దిశను నిర్దేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేయాలని కోరారు. ఈనెల 25వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్‌లో సాయి బాలాజీ స్కూల్ సమీపంలో జరగనున్న మహాసభకు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

**వెలుగొండ ప్రాజెక్ట్ వద్ద శంకుస్థాపన**

అదే రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

ప్రాజెక్ట్ ప్రాంతంలో హెలిప్యాడ్ ఏర్పాటు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక సిద్ధత వంటి అంశాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు సమీక్షిస్తున్నారు. పర్యటన ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం కావాలనే లక్ష్యంతో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తూ, అధికారులు, పార్టీ నాయకులతో సమన్వయం కొనసాగిస్తున్నారు.

## గ్రామీణులకు మెరుగైన చూపు: ఎంపీ వేమిరెడ్డి

- **వరప్రసాద్ రెడ్డి సేవలకు ఎంపీ వేమిరెడ్డి ప్రశంసలు**
- **శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
- **విపిఆర్ స్ఫూర్తితోనే కంటి వైద్య శిబిరం: వర ప్రసాద్‌రెడ్డి**
- **నేడు 50 లక్షల విలువ చేసే ఆపరేషన్లు ఉచితంగా చేయించారు**
- **ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



నెల్లూరు, (చైతన్యరథం): కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరిని మర్చిపోకూడదనే ఆశయంతో మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన శాంతా బయోటెక్నిక్స్ ఫౌండర్ వర ప్రసాద్‌రెడ్డి ఎందరికో ఆదర్శప్రాయులని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టిపి గూడూరు మండలం ఇస్కపాలెంలో శాంత- వసంత ట్రస్తు, శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి నిర్వహిస్తున్న మెగా కంటి వైద్య శిబిరం ముగింపు కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎంతోమంది ఆర్థిక స్తోమత లేక కంటి చూపును నిర్లక్ష్యం చేస్తుంటారని, అలాంటి వారికి శాంత- వసంత ట్రస్టు ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సంస్థను తీసుకువచ్చి కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా వర ప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తల్లిదండ్రులు వెంకట రమణారెడ్డి, శాంతమ్మల జ్ఞాపకార్థం చేపట్టిన శిబిరంలో ఈ తొమ్మిది రోజుల్లో దాదాపు 900 మందికి కంటి పరీక్షలు చేయగా 100 మంది వరకు కాటరాక్ట్ ఆపరేషన్లు చేయించారని, ఒక్కో ఆపరేషన్‌కు 50 వేలు ఖర్చవుతుండగా.. 50 లక్షల విలువైన సర్జరీలు చేశారన్నారు. చెన్నైకి రిఫర్ చేసిన వారు తప్పకుండా వెళ్లి రావాలని ఆయన సూచించారు.

వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి వైద్య శిబిరం ఏర్పాటుకు విపిఆర్ ప్రారంభించిన విపిఆర్ నేత్రనే స్ఫూర్తి అని ప్రస్తావించారు. సొంత నిధులతో ప్రజలకు సేవ చేసేవారు అరుదని, రాజకీయాల్లో ఇలాంటి వ్యక్తి ఉండటం గొప్ప విషయమన్నారు. 26 వేల మందికి కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. 40-50 ఏళ్లు ఉన్న వ్యక్తుల్లో శరీరం శిథిలమవడం ప్రారంభమవుతుందని, ఆ సమయంలో కంటి చూపు మందగించడం సాధారణ విషయమన్నారు. అలాంటి వారి చూపును మెరుగుపరిచేందుకు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృత సేవలందిస్తున్న శంకర నేత్రాలయ సంస్థ ఈ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణులకు ఎంతో ఓపికతో ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా

## స్వచ్ఛ రథానికి శ్రీకారం

**- జెండా ఊపి ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు**




యర్రగొండపాలెం, (చైతన్యరథం): స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయం నందు పెద్దారవీడు మండల స్వచ్ఛ రథాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వచ్ఛ రథం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి గ్రామం, ప్రతి ఇంటి స్థాయిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నెల్లూరు రూరల్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు

*- టిడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సీ.సీ. రోడ్డు పనులను పరిశీలన*



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ సంతోష్ నగర్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను టిడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంతోష్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించి, ఆధునిక విధానాలతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు టిడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు విద్యార్థుల భవిష్యత్తుకు మద్దతుగా ఉంటాయని వారు అన్నారు.

ఇంత మంచి కార్యక్రమాలు చేపట్టిన కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నాయుడు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ మరియు ఆనం రామ నారాయణ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మరియు టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు బీద రవిచంద్రకి ప్రజలు ఎల్లప్పుడూ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, కో-క్లస్టర్ ఇంచార్జ్ పల్నాటి మస్తాన్ నాయుడు, 31వ డివిజన్ అధ్యక్షులు కూకటి హరి యాదవ్, టిడీపీ నాయకులు బత్తల కృష్ణ, 30వ డివిజన్ టిడీపీ అధ్యక్షుడు అత్తివరపు యానదయ్య, ఇతర టిడీపీ నాయకులు ఖాదర్ భాష, సత్తాజ్, శశి రెడ్డి, ఓబుల్ రాజు, జనసేన నాయకుడు కరీమ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కలిగిరి మండల టీడీపీ అధ్యక్షులుగా పూసల వేంగపనాయుడు

**- అభినందనలు వెల్లువ..**



కలిగిరి, (చైతన్యరథం): నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కలిగిరి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పూసాల వెంగపనాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలిగిరి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ,అభినందనలు తో ముంచేత్తేరు.పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీల సమన్వయనికి నిరంతరం శ్రేమిస్తున్న పూసల వెంగపనాయుడు,కీ శుభాకాంక్షలు తెలిపారు. అంతే కాకుండా ప్రజల సమస్యలు పరిస్కారం లో కీలక పాత్ర పోసిస్తున్నారని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వం లో తెలుగుదేశం పార్టీ లో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయన ఉన్నత పదవులు పొంది ఉన్నత స్థాయికి ఎదిగి అధిరోహించాలని పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆకాంక్షించారు.

# కష్టం వస్తే సీఎం చంద్రబాబు పెద్ద దిక్కులా ఆదుకుంటున్నారు

**●సీఎంఆర్ఎఫ్ ద్వారా 20నెలల్లో 304కుటుంబాలను ఆదుకున్నాం**

**●తాజాగా 20మందికి రూ.15లక్షల చెక్కుల పంపిణీ**

**●సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్**



ధర్మవరం (చైతన్యరథం): కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద దిక్కులా అండగా నిలుస్తున్నారని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని పలు కుటుంబాల వారికి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. నాలుగు మండలాలు, ధర్మవరం పట్టానికి చెందిన 20మందికి రూ.15లక్షలు విలువ చేసే చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కష్ట సమయాల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందని వారిని సీఎం సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదుకుంటున్నారన్నారు. ఈ 20నెలల్లో తమ ద్వారా 304మందికి రూ.2.30కోట్ల మేర సాయం అందిందన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తంలో సాయం అందలేదన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. వైద్య పరంగా ఏ కష్టం వచ్చినా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదల వరం లాంటిది

**●టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి**



పెనగలూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయానిధి పేదలకు వరంలాంటిదని రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మీ తెలిపారు. సోమవారం పెనగలూరు మండల పరిధిలో 10 మంది లబ్ధిదారులకు గాను రూ.6.66 లక్షలు ముఖ్యమంత్రి మంజూరు చేసిన చెక్కులను లబ్ధిదారులకు ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అన్ని రంగాలల్లో సంక్షేమం, అభివృద్ధి జరుగుందని చెప్పారు. గ్రామాలలో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అందరిస్తున్నారని తెలిపారు. నారాయణ నెల్లూరు గ్రామానికి చెందిన గిరివర్ధన్‌కు రూ.22,701. ఓబిలి గ్రామానికి చెందిన కార్తీక్‌కు రూ.1,90,000. జడవారిపల్లికి చెందిన రూ.86,295. కొత్త సింగనమల గ్రామానికి చెందిన లావణ్యకు రూ.46,695. కంబాలకుంటకు చెందిన వరప్రసాద్‌కు రూ.36,739. కంబాల కుంటకు చెందిన బుద్ధమ్మకు రూ. రూ.45,895. సాతుపల్లి కి చెందిన సిద్ధారెడ్డికి రూ.1,00,970.ఇండ్లురు గ్రామానికి చెందిన రూ.57,809. పెనగలూరుకు చెందిన వెంకటస్వామికి రూ.37,205.పాత సింగనమలకు చెందిన మౌనికకు రూ.41,870. మొత్తం 6,66,179 ముఖ్య మంత్రి సహాయ సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎరిక్షన్‌బాబు



వెలిగొండ (చైతన్యరథం) : ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టు సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వెలుగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపనకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను వేగవంతం చేసిందన్నారు. ప్రాజెక్ట్ వద్ద హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వంటి ప్రతి అంశాన్ని జిల్లా అధికారులు సమగ్రంగా సమీక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ఎటువంటి లోపాలు లేకుండా పర్యటన విజయవంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు వ్యాఖ్యానించారు. సోమవార ఏర్పాట్లను పరిశీలించిన ఆయన... అధికారులకు పలు సూచనలు చేశారు.

# హామీ నెరవేర్చిన కూటమి... "మార్కాపురం జిల్లా" కృతజ్ఞత సభకు సంసిద్ధం!

**●25న సీఎం బహిరంగ సభను దిగ్విజయం చేద్దాం: దేవినేని ఉమా**

**●వెలిగొండ జాతికి అంకితం పేరుతో జగన్ మోసం... ప్రజల తీర్పే 11 సీట్లు**



మార్కాపురం (చైతన్యరథం): ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించడం ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 25న జరుగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసి మార్కాపురం ప్రజల కృతజ్ఞతను చాటాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో దేవినేని ఉమా మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ప్రాంత అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే 'జాతికి అంకితం' పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని దేవినేని ఉమా ఆరోపించారు. పనులు పూర్తికాకముందే ప్రారంభోత్సవాలు చేసి జిల్లా ప్రజల మనోభావాలతో ఆటలాడారని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిన ఫలితంగానే వైసీపీ 11 సీట్లకు పరిమితమైందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం సభను విజయవంతం చేయడం ద్వారా మార్కాపురం ప్రజల ఐక్యతను చాటాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో సమన్వయం చేసుకుని భారీగా ప్రజలను తరలించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కందుల ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ... సీఎం సభను చారిత్రాత్మకంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యకర్తలు సమన్వయంతో పని చేసి సభ విజయానికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయంచిన ఎంపీ బైరెడ్డి శబరి



నంద్యాల (చైతన్యరథం): నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిద్యాల, జూపాడు బంగ్లా మండలాల కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల విన్నపం మేరకు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జిల్లా కలెక్టర్ ద్వారా సోమవారం సాగునీరు విడుదల చేయించారు. ముచ్చుమర్రిలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికీ రెండు తడులు నీరు పెడితే పంట చేతికి వస్తుందని, నీరు పెట్టకపోతే పంట రాక ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని విన్నపం చేశారు. వెంటనే రైతుల సమస్య ను నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి దృష్టికీ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ కేసీ కెనాల్ అధికారుల ద్వారా రైతుల పంటల వివరాలు సేకరించి రైతుల సమస్య అర్థం చేసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి ఒక పంపు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక పంపు నుంచి కేసి కెనాల్ కు సాగునీరు విడుదల చేశారు. నీళ్లు లేక కేసీ కెనాల్ ఆయకట్టు ఎండిపోతుందన్న విషయం తెలుసుకొని సకాలంలో స్పందించి నీటిని విడుదల చేయించిన నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరికి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిలకు పగిద్యాల, జూపాడుబంగ్లా మండలం కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# సుప్రీంకోర్టులో వైసీపీకి ఎదురుదెబ్బ : కొమరా వెంకట నరసయ్య



ఒంటిమిట్ట (చైతన్యరథం): పవిత్రమైన తిరుమల లడ్డులో జరిగిన కల్తీకి సంబంధించి నిజాలు నిగ్గు తేల్చేందుకు ఏపీ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌కు సుప్రీంకోర్టు నేడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం తిరుమల లడ్డుపై నియమించిన సభ్య కమిషన్ నియామకాన్ని కొట్టివేయాలంటూ మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటీషన్ను సుప్రీంకోర్టు కొట్టివేయడం వైసీపీకి గట్టి ఎదురుదెబ్బని టీడీపీ మాజి రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య అన్నారు. సోమవారం ఒంటిమిట్టలోని హరిత హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట నరసయ్య మాట్లాడుతూ తిరుమల లడ్డు విషయంలో అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా భావించిన సుప్రీంకోర్టు ఆ మేరకు ప్రత్యేక సిబిఐ సిట్ ను నియమించడం జరిగింది. ఈ మేరకు సుప్రీంకోర్టు వేసిన సి.బి.ఐ సిట్, లడ్డులో అనేక రసాయనాలు, జంతువుల కొవ్వు కలవడం జరిగిందని నిర్ధారించడం జరిగింది. ఎన్.డి.డి.బి నివేదిక మేరకు సిబిఐ సిట్ ఈ మొత్తం సంఘటనకు ప్రధాన కారకుడైన అప్పటి టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేయకపోవడం పైన దేశవ్యాప్తంగా హిందువులు తమ నిరసన గలాలను విప్పడంతో, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ను నియమించడం జరిగిందన్నారు. కాగా ఈ కమిషన్ పై ఆందోళనతో గగ్గోలు పెట్టిన వై వి సుబ్బారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే కోసం ప్రయత్నించడం విధితమే. ఈ నేపథ్యంలో వివాదాస్పమైన ఈ అంశంపై రాజకీయ నేత సుబ్రమణ్య స్వామి సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఏక సభ్య కమిషన్ నియామకాన్ని సుప్రీంకోర్టు సమర్ధించడం వైసీపీకి ఒక గట్టి ఎదురుదెబ్బ అని కొమరా వెంకట నరసయ్య అభివర్ణించారు. కొందరు బుద్ధిలేని నాయకులు 100 కోట్ల హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రసార మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. తిరుమల లడ్డుపై హిందుత్వపై నమ్మకం లేని జగన్ రెడ్డి, ఆ పార్టీ కొందరు నాయకులు రాష్ట్రంలో విష ప్రచారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారితో పెట్టుకున్న వారికి దుర్భాషలాడుతున్న వారికి తప్పక తగిన శిక్ష పడడం ఖాయమని వెంకట నరసయ్య ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని తప్పుడు ప్రచారం చేసే వైసీపీ నాయకులు ఆ వెంకటేశ్వరస్వామి వారి ఎదుట చంపలు వేసుకుని తమ దుష్ప్రచారాన్ని మానుకోవాలన ఆయన హితువు పలికారు.

# సుస్థిర అభివృద్ధి కోసం కృత్రిమ మేధను స్వీకరించాలి

తిరుపతి (చైతన్యరథం): సుస్థిర అభివృద్ధి కోసం కృత్రిమ మేధను స్వీకరించాలని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య నరసింగరావు అన్నారు. సోమవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భూగోళ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "సుస్థిర అభివృద్ధి, వికసిత్ భారత్ కోసం నీరు, నేల వనరుల నిర్వహణలో జియో స్పేషియల్ టెక్నాలజీస్" అనే అంశంపై సెనేట్ హాల్లో 20వ అంతర్జాతీయ భౌగోళిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు పరిశోధనా పండితులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులుగా ఎదగడానికి బహుభాషా ప్రావీణ్యం తప్పనిసరి

## హాంకాంగ్ భారత కాన్సులేటర్ జనరల్ సురభి గోయల్

## హాంకాంగ్ తెలుగు సమాఖ్య ఆధ్వర్యాన ఘనంగా మాతృభాష దినోత్సవం

హాంకాంగ్: బాలలు భవిష్యత్తులో ప్రతిభావంతులైన అంతర్జాతీయ పౌరులుగా ఎదగడానికి బహుభాషా నైపుణ్యం తప్పనిసరి అని హాంకాంగ్ కాన్సులేట్ జనరల్ సురభిగోయల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం(IMLD) వేడుకలను హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య (The Hong Kong Telugu Samakhya--THKTS) ఆధ్వర్యాన తుంగ్ చుంగ్‌లోని నాక్ సెంటర్ ప్రాంగణంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సురభి గోయల్ మాట్లాడుతూ... ది హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య ప్రతి ఏటా ఇంటర్నేషనల్ మదర్ లాంగ్వేజ్ డే నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పిల్లలు తమ మాతృభాషను ప్రేమించడమేగాక నేర్చుకుంటున్నారు, ఇందుకోసం వారి తల్లిదండ్రుల ప్రయత్నాలు ప్రశంసనీయమన్నారు. ఆధునిక హిందీ సాహిత్య పితామహుడు భరతేందు హరిశ్చంద్రను ఉటంకిస్తూ, మాతృభాష జాతీయత భావం, వ్యక్తిగత పురోగతికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయాన్ని సాధించిందని, మాతృభాషలను పరిరిరక్షణకు కార్యక్రమ నిర్వాహకురాలు జయ పీసపాటి చేస్తున్న కృషిని అభినందించారు. బాలలు ప్రపంచ పౌరులుగా విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలతో వ్యక్తులను సన్నద్ధం చేయడానికి మాతృభాషలు, ఇతరభాషలను నేర్చుకోవాలన్న గోయల్ అభిప్రాయాన్ని కార్యక్రమాన్ని హాజరైన ప్రముఖులంతా సమర్థించారు.



### భాష మన వారసత్వంలో అంతర్భాగం: జయ పీసపాటి

హాంకాంగ్ తెలుగు సమాఖ్య (The Hong Kong Telugu Samakhya-THKTS) వ్యవస్థాపక సభ్యురాలు జయ పీసపాటి మాట్లాడుతూ... బహుళ సంస్కృతులు కలిగిన దేశంలో, ప్రప్రథంగా తమ సమాఖ్య విభిన్న సమాజాలను, వారి మాతృభాషలను గుర్తుచేస్తూ, అందరినీ ఒకచోట చేర్చి, వేడుకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. భాష మన వారసత్వంలో అంతర్భాగమని మేము విశ్వసిస్తున్నాము. యువతరంలో దాని ప్రాముఖ్యతను ప్రోత్సహించడం చాలా అవసరం. సాంస్కృతిక అంతరాలను తగ్గించడంలో, ప్రపంచ అవగాహనను ప్రోత్సహించడంలో భాష యొక్క శక్తికి ఈ కార్యక్రమం నిదర్శనం. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో ప్రపంచం మరింత పరస్పరం అనుసంధానమై ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ పౌరసత్వాన్ని పెంపొందించడంలో భాష ప్రాముఖ్యతను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. పాల్గొన్న పిల్లలందరికీ గౌరవ కాన్సుల్ (Consul General of India) మిస్ సురభి గోయల్ ధృవీకరణ పత్రాలను బహూకరించారు.

### ఉత్సాహంగా బాలల ప్రదర్శనలు

ఈ సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (International Mother Language Day) థీమ్ "యూత్ వాయిసెస్ ఆన్ మల్టీలింగ్వల్ ఎడ్యుకేషన్"లో పిల్లలు ఉత్సాహంగా నృత్య గాన ప్రదర్శనలు ఇచ్చి, థీమ్ గురించి మాట్లాడారు. వారు సంస్కృతం, ఇంగ్లీష్, కొరియన్,చైనీస్, బంగ్లా, హిందీ,తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠీలతో సహా వారి మాతృభాషల పట్ల తమ వాత్సల్యాన్ని ప్రదర్శించారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి జయ పీసపాటి కార్యక్రమ నిర్వహణలో సఫలీకృతమయ్యారు. ముఖ్యంగా 2021లో కోవిద్-19 మహమ్మారి సమయంలో పిల్లలు, తల్లిదండ్రుల్లో మాతృభాషల ప్రాముఖ్యతను ప్రోత్సహించాలని సంకల్పించి, తమ ప్రయత్నాలను ప్రారంభించారు. ముఖ్యంగా 2021జూమ్ మాధ్యమంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి యునెస్కో (United Nations Educational Scientific and Cultural Organization), హాంకాంగ్ అసోసియేషన్ గ్లోకల్ పీస్ సెంటర్ మద్దతునిచ్చాయి. ఈ సంవత్సరం నాక్ (NAAC) వేదిక మద్దతు ఇవ్వగా, టుమారోస్ యూత్ డెవెలెప్మెంట్ ఫండ్ లిమిటెడ్ (TYFDL) కూడా సహకారాన్ని అందించారు. హాంకాంగ్ గ్లోకల్ పీస్ సెంటర్‌లో కమ్యూనిటీ విభాగానికి కో–చైర్‌గా సేవలందిస్తున్న తిరునాచ్ నాచియాపన్, ఐఎంఎల్ డి 2026 కన్వీనర్‌గా సహకరించారు.



### అనేక భాషలు - ఒకే భవిష్యత్తు

బహుభాషావేత్తలుగా మారతామని ప్రతిజ్ఞ చేస్తూ, తదుపరి సంవత్సరం సమావేశమవుతామని అందరూ హామీ ఇవ్వడంతో హాలంతా ఉత్సాహంతో నిండి పోయింది. ప్రతి బాలబాలికల స్వరం ముఖ్యమైనది, ప్రతి భాషకు విలువనిచ్చే భవిష్యత్తును మనం కలిసి రూపొందిస్తున్నాం, అనేక భాషలు, ఒకే భవిష్యత్తు." అన్న యునెస్కో సందేశం మనకు గుర్తు చేస్తున్నట్లుగా మీరు ఆ భవిష్యత్తుకు నాయకులు. భవిష్యత్తులో రెట్టించినశక్తి, గర్వంతో మళ్లీ ఈ కార్యక్రమం జరుపుకుందామని శ్రీమతి జయ పీసపాటి (Jaya Peesapaty) చేసిన వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో నాక్ (NAAC) ప్రాంతీయ డైరెక్టర్ మిస్ కోనీ వాంగ్, యునెస్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ మారకో క్వాన్, టుమారోస్ యూత్ డెవెలెప్మెంట్ ఫండ్ లిమిటెడ్ (TYFDL) డైరెక్టర్ జాకీ చెంగ్, చైనా, బంగ్లాదేశ్ ఫ్రెండ్షిప్ సెంటర్ అధ్యక్షులు డా.ఇస్లాం ముహమ్మద్ ఫ్యాక్రుల్ బాబు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

# ఎంత ఎత్తుకు ఎదిగినా మాతృభాషను మరవొద్దు!

## తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా. తోటకూర ప్రసాద్

## జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

యుఎస్ఏ: మాతృభాష అనేది మన గుర్తింపు, అది మన మూలాలను గుర్తు చేస్తుంది, మన సంస్కృతిని నిలబెడుతుంది. ఎన్ని భాషలు నేర్చుకున్నా, ఎంత ఎత్తుకు ఎదిగినా, మాతృభాషను మరచిపోకూడదు, దాన్ని ప్రేమించాలి,గౌరవించాలి, రక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తానా ప్రపంచసాహిత్యవేదిక నిర్వాహకులు డా.తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. తానా సంస్థ సాహిత్య విభాగం 'తానా ప్రపంచసాహిత్య వేదిక' ఆధ్వర్యంలో గత ఐదున్నర సంవత్సరాలకు పైగా "నెల నెలా తెలుగు వెలుగు" పేరిట ప్రతి నెలా ఆఖరి ఆదివారం అంతర్జాతీయ అంతర్జాల దృశ్యసమావేశాలు నిర్వహిస్తున్నారు.అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తాజాగా నిర్వహించిన "మన తెలుగు భాషను ప్రేమిద్దాం, పరిరక్షిద్దాం, పరివ్యాప్తి చేద్దాం" అనే 89వ సభ చాలా విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ... అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మనకు మాతృభాష ప్రాధాన్యతను గుర్తుచేస్తుంది. మాతృభాషను కాపాడటం అంటే మన సాహిత్యం, జానపద గాథలు, సామెతలు, సంపూర్ణ సంస్కృతిని, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమే.తల్లిదండ్రులు పిల్లలకు పసి వయస్సులోనే కథలు, పాటలు, పద్యాలు,నీతి కథలు లాంటివి మాతృభాషలో పరిచయం చేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు తెలుగుభాషకు సాంకేతిక పరిజ్ఞాన్ని జోడించి ప్రాథమిక స్థాయిలో కనీసం 5వ తరగతి వరకు తెలుగుభాషలో విద్యాభోధన తప్పనిసరిచేయాలి. న్యాయ, పరిపాలనా రంగాల్లో మాతృభాష వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

### నా ఉన్నతికి మాతృభాషే కారణం

న్యూయార్క్ నుండిముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రఖ్యాత కాన్సర్ వైద్యనిపుణులు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డా.నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ నా ప్రాథమిక, ఉన్నతవిద్య అంతా తెలుగు మాధ్యమంలోనే జరిగింది. ఆ తర్వాతే వైద్య విద్య ఆంగ్ల మాధ్యమంలో జరిగింది. దానివల్ల ఎలాంటి ఇబ్బంది కలగలేదు. దానికి కారణం మాతృభాషలో ప్రాథమికస్థాయిలో పట్టు సంపాదించడమే. అంతేగాక తాను కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు తన తెలుగు అధ్యాపకులు తెలుగు కవుల వైభవంపై చెప్పిన పద్యాలు, గద్యాలు ఇంకా నాకు గుర్తున్నాయని అంటూ వాటిని చెప్పి అందరిని ఆశ్చర్యపరచారు. ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధించడానికి మాతృభాష ఆటంకం కాదు, అవసరం. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, ప్రభుత్వాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని దత్తాత్రేయుడు అన్నారు.

### అబ్దుల్ కలాం చదువుకున్నది మాతృభాషలోనే

విశిష్టఅతిథిగా పాల్గొన్నభారతదేశ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్(DRDO) పూర్వ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, భారతదేశ పూర్వ రాష్ట్రపతి డా. ఎపిజె అబ్దుల్ కలాం చదువుకున్నది తన మాతృభాష అయిన తమిళంలోనే. జీవితంలో ఆయన అత్యున్నత శిఖరాలు అధిరోహించడానికివారి మాతృభాష ఎక్కడా అవరోధం కాలేదు. నేను పుట్టి పెరిగింది నెల్లూరు జిల్లాలోని మహిమలూరు అనే చిన్న గ్రామం, చదువుకున్నది అంతా తెలుగు మాధ్యమంలోనే. ప్రతిష్టాత్మక డిఆర్ డిఓ సంస్థకు ఛైర్మన్‌గా, రక్షణ మంత్రికి సలహాదారుగా వ్యవహరించే స్థితికి చేరుకోవడానికి నా తెలుగుభాష తోడ్పడిందే తప్ప అవరోధం కాలేదు. ఎంతఎత్తుకు ఎదిగినా మాతృభాషలో మాట్లాడడానికి గర్వపడాలే తప్ప సిగ్గు పడకూడదు. పిల్లలకు ఇళ్ళవద్ద తెలుగు నేర్పవలసిన భాధ్యత తల్లిదండ్రులదే. ప్రభుత్వాలు చక్కని విధి విధానాలతో మాతృభాషకు ప్రాధ్యానం ఇవ్వాలన్నారు.

### ప్రవాసాంధ్రుల సహకారం అవసరం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయపు ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు తన విశ్వవిద్యాలయంలో తెలుగుభాష సంరక్షణ, పరివ్యాప్తి కోసం తీసుకుంటున్న చర్యలు సోదాహరణంగావివరిస్తూ అవి సాకారం కావడానికి ప్రవాసాంధ్రుల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ఆచార్యులు డా.అఫ్సర్,యూనివర్సిటీ ఆఫ్వాషింగ్టన్, సియాటెల్లో తెలుగు అధ్యాపకురాలు ఉమా అత్తోట, యూనివర్సిటీ ఆఫ్కాలిఫోర్నియా, బర్కలీలో సౌత్ ఏషియన్ స్టడీస్ అధ్యాపకురాలు డా.భారతి శంకరరాజులు మాట్లాడుతూ అమెరికాలో తెలుగువారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతున్న నేపధ్యంలో వివిధ నగరాలలో పాఠశాల, కళాశాలస్థాయిల నుండే తెలుగును ఒక కోర్సుగా ప్రవేశపెట్టే ఆలోచన చేయాలన్నారు. అంతేగాక ఇంటివద్ద పిల్లలకు అనునిత్యం సహజసిద్ధంగా తెలుగు వినబడేటట్లు, కనబడేటట్లు చేస్తూ, తప్పనిసరిగా తల్లిదండ్రులు తెలుగులోనే మాట్లాడితే పరదేశంలో భాష అస్తితత్వాన్ని నిలబెట్టుకునే అవకాశం కలుగు తుందన్నారు.




### ఎక్కడున్నా తెలుగుభాషను మరువొద్దు

భీమవరంలో జన్మించి, హైదరాబాద్, లండన్ నగరాల్లో ఉన్నత చదువులు చదివి,రాజకీయాల్లో ప్రవేశించి ప్రస్తుతం రాయల్ బోరో ఆఫ్ కెన్సింగ్ స్టన్ ఆండ్ చెల్సియా, సెంట్రల్ లండన్, డిప్యూటీ మేయ్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి మాట్లాడుతూ భారతదేశం నుండి వచ్చి బ్రిటన్‌లో స్థిరపడిన గుజరాతీ,హిందీ, తమిళ, బెంగాలీ, మరాఠా ప్రజలకున్న భాషాభిమానంతో పోలిస్తే మన తెలుగు వారికున్న భాషాభిమానం చాల తక్కువ అన్నారు. మనం ఎక్కడ ఉన్నా తెలుగు భాషను మరువకూడదు అన్నారు. తానా పూర్వాధ్యక్షులు జయశేఖర్ మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంలో తెలుగు భాష పరిరక్షణ, పరివ్యాప్తి కోసం అందరం కృషి చేద్దామనే సంకల్పంతో ముందుకు సాగుదామని అన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డా. నోరి దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్ పురస్కారం లభించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. తానా ప్రపంచసాహిత్యవేదిక సమన్వయ కర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ తెలుగుభాష వైభావాన్ని, ప్రస్తుత దుస్థితిని తాను రచించిన పద్యరూపంలో ఆలపించి,ఈ కార్యక్రమ నిర్వహణలో తోడ్పడిన తానా కార్యవర్గ సభ్యులకు, ప్రసారమాధ్యమాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


# దేశ రాజధానిలో బాంబు బెదిరింపులు

దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపాయి. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎర్రకోటతో పాటు ఢిల్లీ శాసనసభ, పలు పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు, బాంబు స్క్వాడ్, భద్రతా బలగాలు రంగంలోకి దిగి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం కొన్ని అనుమానాస్పద కాల్స్ రావడంతో ఎర్రకోట, అసెంబ్లీ, పాఠశాలల వద్ద అత్యవసర భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనతో కాసేపు ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

**ఎర్రకోట పరిసరాల్లో హైఅలర్ట్**

దేశానికి చారిత్రక, సాంస్కృతిక ప్రతీకగా నిలిచిన ఎర్రకోటకు బాంబు బెదిరింపు రావడం భద్రతా సంస్థలకు పెద్ద సవాల్‌గా మారింది. వెంటనే ఎర్రకోట పరిసర ప్రాంతాలను పోలీసులు పూర్తిగా కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, సందర్శకుల ప్రాంతాలు, భద్రతా సున్నిత ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎర్రకోటలో పనిచేస్తున్న సిబ్బంది, సందర్శకులను తాత్కాలికంగా బయటకు పంపించి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గుర్తించలేదని స్పష్టం చేశారు.

**ఎర్రకోట సహా పలుచోట్ల విస్తృత తనిఖీలు**



దీంతో ఇది కేవలం ఫేక్ కాల్ అయ్యే అవకాశముందని అధికారులు అనుమానిస్తున్నారు.

**ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం..**

ఢిల్లీ అసెంబ్లీకి కూడా బాంబు బెదిరింపు కాల్ రావడంతో అక్కడ భద్రతను పెంచారు అధికారులు. పరిసర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రతి వాహనం, కార్యాలయ గదులు, పార్కింగ్ ప్రాంతాలను ప్రత్యేక పరికరాలతో తనిఖీ చేసినట్లు సమాచారం. అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేసి, భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేశారు. అయితే ఈ తనిఖీల్లోనూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా పేలుడు పదార్థాలు గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు.

**పాఠశాలలకు బాంబు బెదిరింపులు..**

ఢిల్లీలోని పలు పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ రావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. స్కూల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా కొన్నిచోట్ల తరగతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కొన్నిచోట్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నప్పటికీ.. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తనిఖీల అనంతరం స్కూల్ ప్రాంగణాల్లోనూ ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు ధ్రువీకరించారు.

**ఫేక్ కాల్ కోణంలో దర్యాప్తు..**

ఈ బాంబు బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది. ఫోన్ నంబర్, లొకేషన్, కాల్స్ రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కాల్స్ ద్వారా ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, భద్రతా వ్యవస్థను పరీక్షించడం వంటి ఉద్దేశాలు ఉండవచ్చని ఇంటెలిజెన్స్ అధికారులు చెబుతున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.


**అప్రమత్తంగా ఉండాలి..**

ఈ సంఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు. ఇటీవల దేశంలోని పలు నగరాల్లో ఇలాంటి ఫేక్ బాంబు బెదిరింపులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా స్కూళ్లు విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి కాల్స్ వస్తున్నాయి. ఇవి ఎక్కువగా ఫేక్ కాల్స్ అయినప్పటికీ, భద్రతా దృష్ట్యా ప్రతి కాల్‌ను సీరియస్‌గా తీసుకుని అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, భద్రతా సంస్థలకు సహకరించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని ఢిల్లీ పోలీసులు సూచించారు.

## సోనా బంగ్లా సాకారానికి సహకరించాలి

**- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగనున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. 'జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశం ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసిత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ



పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యువత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్ ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు. 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## ఇండియా కూటమి బాధ్యతల నుంచి రాహుల్ తప్పుకోవాలి

**కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ సూచన**



కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి సారథ్య బాధ్యతల నుంచి రాహుల్‌గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వి యాదవ్ వంటి సమర్థులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమతా బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమతా దీదీ, అఖిలేష్, తేజస్వి, ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది.

**రాజ్యసభ సీటు కోసమే..**

కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్‌కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బెంగాల్ కాంగ్రెస్ నేతలు సైతం అయ్యర్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా మణిశంకర్ అయ్యర్ దూరంగా ఉన్నారని, బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ సీట్లు ఖాళీగా ఉండటమే మణిశంకర్ అయ్యర్ తాజా వ్యాఖ్యలకు కారణం కావచ్చని బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్ రాయ్ అన్నారు.

**ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా**

## విద్యార్థుల ఆందోళన



ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు మరోసారి ఆందోళనకు దిగారు. గత నెలలో జరిగిన ఆందోళనను ప్రభుత్వం కఠినంగా అణచివేయడంతో సద్దుమణిగినట్టు కనిపించినా శనివారం మళ్లీ మతపాలకులకు నిరసన తెలుపుతూ వీధుల్లోకి వచ్చారు. టెహ్రాన్‌లోని షరీఫ్ ఇంజినీరింగ్ యూనివర్సిటీ విద్యార్థులు 'బి షరఫ్' (సిగ్గుచేటు) అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనెయీను 'హంతక నేత'గా అభివర్ణించారు. ప్రవాసంలో ఉన్న రాకుమారుడు రెజా పహ్లవీ రాజుగా బాధ్యతలు చేపట్టాలని డిమాండు చేశారు. టెహ్రాన్‌లోని బెహెస్తీ, అమిర్ కబీర్ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ఆందోళనకు దిగారు. నిరసనలకు కేంద్రస్థానంగా ఉన్న అబ్దానన్ పట్టణంలో విద్యార్థులు 'నియంతకు మరణం' అంటూ నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న టీచరును అరెస్టు చేయడంతో సుప్రీంలీడర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు.

# ఇరాన్‌ను తక్షణం వీడండి..

## భారత పౌరులకు కేంద్రం అడ్వైజరీ



ఇరాన్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దాడి చేయొచ్చన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో పరిస్థితులు మళ్లీ గందరగోళంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు మన దేశ ఎంబసీ తాజాగా అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. "ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా.. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వైజరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లోవున్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారతీయ పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండాలని, అలాగే తాజా పరిణామాల కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచిస్తున్నాం. భారతీయులంతా పాస్‌పోర్టు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి సహాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించండి. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోండి" అని భారత ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది.

ఇరాన్-అమెరికా మధ్య అణు చర్చలు ఇంతవరకూ కొలిక్కిరాలేదు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహననౌకలు, జలాంత ర్గాములు, ఫైటర్ జెట్లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఇరాన్ తొలిదశ అల్లర్లలో 7,105మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది.

# డ్రగ్ డాన్ 'ఎల్ మెంచో' ఖతం

## ప్రత్యేక ఆర్మీ ఆపరేషన్‌తో మట్టుబెట్టిన మెక్సికో

## మెక్సికోలో మెంచో అనుచరుల హింసాత్మక ఆందోళనలు



మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో ఒసెగుయెరా అలియాస్ 'ఎల్ మెంచో' హతమయ్యాడు. ఆదివారం జరిగిన ఆపరేషన్‌లో అతడిని మట్టుబెట్టినట్లు మెక్సికో ఆర్మీ వెల్లడించింది. దీంతో ఆ దేశంలో పెద్దఎత్తున ఆందోళనలు చెలరేగాయి. 59 ఏళ్ల ఎల్ మెంచోను పట్టుకోవడానికి మెక్సికో సైన్యం నిన్న ఆపరేషన్ చేపట్టింది. అమెరికా నిఘా వర్గాల సమాచారంతో జాలిస్కో రాష్ట్రంలోని తపాల్ప పట్టణంలో అతడు నక్కిన ప్రాంతాన్ని చుట్టుముట్టి సోదాలు చేపట్టింది. ఈ క్రమంలోనే మెంచో అనుచరులు కాల్పులు జరపగా.. సైన్యం ఎదురుదాడి చేసింది. ఈ భీకర ఆపరేషన్‌లో మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని పట్టుకుని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు మెక్సికో సైన్యం వెల్లడించింది.

ఎల్ మెంచోతోపాటు అతడి ముఠాకు చెందిన మరో ఆరుగురు ఆపరేషన్‌లో మరణించినట్లు అక్కడి సైన్యం తెలిపింది. ఈ ఘటనతో మెక్సికోలోని పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఆందోళనలు చెలరేగాయి. మాఫియా డాన్ అనుచరులు పలు ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టారు. రహదారులను దిగ్బంధించారు. సూపర్ మార్కెట్లు, బ్యాంకులను తగలబెట్టారు. ఎల్ మెంచో 2009లో జాలిస్కో న్యూజనరేషన్ కార్టెల్ అనే మాదకద్రవ్యాల ముఠాను ఏర్పాటు చేశాడు. గత దశాబ్దకాలంలో మెక్సికోలో అత్యంత శక్తిమంతమైన నేర సిండికేట్‌గా మారాడు. అమెరికాకు ప్రధాన డ్రగ్స్ అక్రమ రవాణాదారుగా ఎదిగాడు. జాలిస్కో కార్టెల్ను అగ్రరాజ్యం ఉగ్ర సంస్థగా పరిగణించింది. మెంచో తలపై 15 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.136 కోట్లు) రివార్డు ప్రకటించింది. తాజా పరిణామాలపై వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ స్పందించారు. "ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో ప్రభుత్వానికి అమెరికా ఇంటెలిజెన్స్ సహకారం అందించింది. అతడు మా దేశానికి ఫెంటనిల్‌ను అక్రమంగా తరలిస్తున్నాడు. ఇలాంటి నార్కో టెర్రరిస్టును అగ్రరాజ్యం ఎన్నటికీ సహించబోదు" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**భారత్ అడ్వైజరీ..**

మెక్సికోలో అల్లర్ల నేపథ్యంలో అక్కడి భారత పౌరులకు మన ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుత హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా మెక్సికోలోని భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని పేర్కొంది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, స్థానిక అధికారుల అప్‌డేట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపింది. సాయం కోసం ఎంబసీని సంప్రదించాలని సూచించింది.

# గోల్డెన్ హొరైజన్..

## భారత్‌కు అమ్మేందుకు ఇజ్రాయెల్ ఆసక్తి



బ్రహ్మోస్ క్షిపణికన్నా వేగంగా ప్రయాణించే గోల్డెన్ హొరైజన్ క్షిపణిని.. భారత్‌కు అమ్మేందుకు ఇజ్రాయెల్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గోల్డెన్ హొరైజన్ ఎయిర్ లాంచ్డ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను డీప్ స్ట్రయిక్ వెపన్‌గా డిజైన్ చేశారు. చాలా కట్టుదిట్టమైన, అండర్‌గ్రౌండ్ కేంద్రాలను కూడా ఇది ధ్వంసం చేస్తుంది. ఇజ్రాయిల్‌కు చెందిన సిల్వర్ స్పారో క్షిపణి వ్యవస్థ నుంచే గోల్డెన్ హొరైజన్ మిస్సైల్‌ను డెవలప్ చేశారు. బాలిస్టిక్ బెదిరింపులను ఎదుర్కొనే రీతిలో ఈ మిస్సైల్‌ను రూపొందించారు. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నుంచి ప్రయోగించే రీతిలో కొత్త వేరియంట్‌ను అభివృద్ధి చేసినట్లు రక్షణ శాఖ నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ క్షిపణికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఇంకా వెల్లడించలేదు. కానీ రక్షణశాఖ నివేదికల ప్రకారం ఈ క్షిపణి సుమారు రెండువేల కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదని తెలుస్తోంది. అవసరమైతే దీన్ని భారత వైమానిక దళంలో ఉన్న సుఖోయ్ 30ఎంకెఐ ఫ్లీట్‌లో చేర్చే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. దీనివల్ల మన వైమానిక సామర్థ్యం పెరిగే అవకాశముంది.

ఈ గోల్డెన్ హొరైజన్‌ను.. చాలా లోతుగా ఉండే బలమైన కాంక్రీట్‌ను చీల్చుకుంటూ అండర్ గ్రౌండ్ బంకర్లను ధ్వంసం చేసే రీతిలో క్షిపణిని డెవలప్ చేశారు. అణ్వాయుధ క్షేత్రాలను కూడా ఈ క్షిపణి చిత్తుచేస్తుంది. గగనతలం నుంచి ప్రయోగించే క్షిపణి తరహాలో గోల్డెన్ హొరైజన్ చాలా వేగంగా ఆల్టిట్యూడ్ మారుతుంది. దీని టర్మినల్ వెలాసిటీ వేగం హైపర్ సోనిక్ స్థాయిలో ఉంటుంది. ధ్వని వేగంకన్నా వేగంగా... దాదాపు మాక్ 5 స్థాయిలో ఈ క్షిపణి ప్రయాణిస్తుంది. చివరి దశలో ఆ క్షిపణి నుంచి రిలీజయ్యే కైనటిక్ ఎనర్జీ వల్ల.. చాలా లోతుగా భూగర్భంలోకి ఆ క్షిపణి వెళ్తుంది. గోల్డెన్ హొరైజన్‌ను సరఫరా చేసేందుకు ఇజ్రాయిల్ ఆసక్తిగా ఉన్నా.. ఆ మిస్సైల్‌ను కొనేందుకు ఇండియా ఆసక్తిగా ఉందా లేదా అన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియదు.

# బంగ్లాలో అమానుషం

- హిందూ దివ్యాంగురాలిపై ముగ్గురి అత్యాచారం
- నిరసనలకు దిగిన హిందూ, మానవ హక్కుల సంఘాలు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పూర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయివున్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది. ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.



# నేపాల్లో ఘోర ప్రమాదం

- లోయలోకి జారిన ప్రయాణికుల బస్సు
- 18 మంది మృతి.. 28మందికి గాయాలు



నేపాల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ప్రయాణికుల బస్సు లోయలో పడి 18మంది మృతిచెందారు. మరో 28మంది గాయపడ్డారు. పోఖారా నుంచి కాఠ్మండూకి వెళ్తుండగా సోమవారం తెల్లవారుఝామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 45మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగంవల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# థర్డ్ వరల్డ్ వార్..

# పుతిన్ మొదలు పెట్టాడు!

రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం నాలుగేళ్లకు చేరుకున్నది. 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎప్పుడో మూడో ప్రపంచ యుద్ధాన్ని మొదలుపెట్టారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రష్యాపై కాలుదువ్వడాన్ని సమర్థించుకున్న జెలెన్స్కీ.. తామేమీ యుద్ధంనుంచి విరమించడం లేదన్నారు. ఈ యుద్ధంలో తాము విజేతలుగా నిలుస్తామని జెలెన్స్కీ అన్నారు. కాల్పుల విరమణ పాటించాలని పుతిన్ చేసిన డిమాండ్‌ను ఆయన కొట్టిపారేశారు. వేలమంది సైనికులు మృతిచెందిన తర్వాత తమ వ్యూహాత్మక స్థానాలను రష్యా వదులుకున్నట్లు జెలెన్స్కీ చెప్పారు. పుతిన్ ఎప్పుడో మూడవ ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించారని, దీన్ని అడ్డుకోవాలంటే రష్యాపై తీవ్రమైన సైనిక, ఆర్థిక వత్తిడి తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఆయన ఎంత భూభాగాన్ని ఆక్రమిస్తారు? ఆయన్ను ఎలా అడ్డుకోవాలన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారిందని, ప్రపంచంపై రష్యా తన పెత్తనాన్ని ప్రదర్శిస్తున్నట్లు జెలెన్ స్కీ వ్యాఖ్యానించారు.



చైతన్య రథం
# సినిమా
మంగళవారం 24 ఫిబ్రవరి 2026 IX

## వరుస ఫ్లాపుల్లోనూ అదే ఊపు



వరుస ఫ్లాపుల్లోనూ టాప్‌రేటెడ్ హీరోయిన్‌గా శ్రీలీల కెరీర్ కొనసాగిస్తోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో షార్ట్‌టైంలోనే మంచి ఇమేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ.. రవితేజతో చేసిన ధమాకాతో తెలుగులో తొలి భారీ హిట్ అందుకుంది. అప్పటినుంచీ హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా వుంది. ఇప్పుడు -కోలీవుడ్‌పైనా శ్రీలీల దృష్టి పెట్టింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడా అవకాశాలు అందుకుంటోంది. తాజాగా ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న ‘డి-55’ ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్. ఇందులో సాయిపల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తించే అంశం. తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళస్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందన్నది టాక్. ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో మరోసారి చేతులు కలపనున్నాడు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న కథలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా డిజైన్ చేస్తున్నారట. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్టు టాక్. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే శ్రీలీల కెరీర్‌లో ఇదొక పెద్ద టర్నింగ్ పాయింట్ కావొచ్చు. ప్రస్తుతం.. సోషల్ మీడియాలో అజిత్-శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.



## సేతుపతి -సాయిపల్లవి కాంబోలో..

మణిరత్నం సినిమాలకుండే క్రేజ్ ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి రొమాంటిక్ డ్రామా ఒకటి రానుందట. సినిమాను మణిరత్నం ముందుగా శింబుతోకానీ ధ్రువ్ విక్రమ్‌తోకానీ అంతా చేస్తాడను కున్నారు. కానీ అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి చేతిలోకి వెళ్లింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర కథనాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇందులో సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనుంది. తాజా టాక్ ప్రకారం ఇప్పటికే ఏఆర్ రెహమాన్ టీం కొన్ని ట్రాక్స్ కూడా కంపోజ్ చేసిందట. విజయ్ సేతుపతి ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవగానే.. మణిరత్నం ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ మూవీ అధికారిక ప్రకటన ఉండబోతుందట. 2025లో థగ్‌లైఫ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మణిరత్నానికి.. అది భారీ నిరాశే మిగిల్చింది. విజయ్ సేతుపతి ప్రస్తుతం జైలర్-2తోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు. సాయిపల్లవి ‘ఏక్ దిన్’తోపాటు, ధనుష్‌తో డి-55, రామాయణ పార్ట్-1, రామాయణ పార్ట్-2లలో నటిస్తోంది.

## ఉదయ్‌పూర్‌లో ‘విరోష్’..

ఎట్టకేలకు ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన ప్రేమ జంట.. పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమైంది. 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పెళ్లి జరగనున్న నేపథ్యంలో.. విజయ్, రష్మిక, ఆనంద్ దేవరకొండ అక్కడికి బయలుదేరినట్టు సమాచారం. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. అభిమానులు ప్రేమగా పిలిచే ‘విరోష్’ పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని చెబుతున్నాడు విజయ్. మీరు ప్రేమగా పెట్టిన పేరు ‘విరోష్’. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. ‘ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్’ అంటూ ఎమోషనల్ గా రాసుకొచ్చాడు.



ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## దుబాయ్‌కి ‘త్రి-వె’ టీం!

వెంకీ, త్రివిక్రమ్ కాంబోలో రానున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం’ ఏకె -47. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ దశలోవున్న ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ ఒకటి వినిపిస్తోంది. ఇప్పటివరకు 40శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు నటిస్తున్నాడు. అయితే, మేకర్స్‌నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్‌కి పూర్తి కావొచ్చని సమాచారం. ఇప్పటికే ‘నువ్వు నాకు నచ్చవ్’, ‘మల్లీశ్వరి’ వంటి హిట్ చిత్రాలకు రైటర్-హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ.. ఇప్పుడు డైరెక్టర్-హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ ఉంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధిశెట్టి హీరోయిన్‌గా నటిస్తుంటే, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్ రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.



## ప్రభాస్‌కి పడిపోయిందట..



హిట్లు, ఫ్లాపుల తో సంబంధం లేకుండా ప్రభాస్ వరుసపెట్టి సినిమాలు చేసేస్తున్నాడు. సందీప్ వంగాతో స్పిరిట్ చేస్తూనే.. దర్శకుడు హను రాఘవపూడి డైరెక్షన్‌లో ‘ఫౌజీ’చిత్రంలో ప్రభాస్ నటిస్తున్నాడు. పీరియాడిక్ రొమాంటిక్ యాక్షన్ చిత్రంగా తెరకెక్కుతున్న సినిమాలో ప్రభాస్ ఓ సైనికుడి పాత్రలో కనిపిస్తాడు. ఇక ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. అయితే, ప్రభాస్ మంచి తనానికి.. ఆయన చూపెట్టే హాస్పిటాలిటీకి ఇప్పుడు ఇమాన్వి ఫిదా అయిపోయిందట. ప్రభాస్ తన ఇంటినుంచి ఇమాన్వికి భోజనం పంపడంతో ఆమె ఒక్కసారిగా షాక్ అయింది. ప్రభాస్ తోటి స్టార్స్‌ను ఇంత ఇష్టంగా చూసు కుంటాడని తెలుసుకుని ఇమాన్వి ప్రభాస్‌కు ఫ్యాన్ అయిపోయింది. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగు తోంది.కాగా, ఈ సినిమాలో అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.




## త్రిప్తికి.. రెండో తెలుగు ప్రాజెక్టు?

‘యానిమల్’తో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి దిమ్రి.. ప్రస్తుతం సందీప్‌రెడ్డి వంగా -ప్రభాస్ కాంబోలో రానున్న భారీ ప్రాజెక్టులో లీడ్ రోల్ చేస్తోంది. ఈ ప్రాజెక్టులో త్రిప్తి దిమ్రిని ఓ రేంజ్‌లో చూపించనున్నాడట దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఇప్పుడు తాజాగా - ‘ఓజీ’ ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని చేయనున్న స్టయిలిష్ యాక్షన్ డ్రామా ప్రాజెక్టులోనూ త్రిప్తికి చోటు దక్కినట్టు ఇండస్ట్రీ టాక్. ‘బ్లడీ రోమియో’ టైటిల్‌తో రానున్న ఈ ప్రాజెక్టు నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతోంది. ఇది సుజీత్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగం. అయితే, ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ త్రిప్తి డిమ్రీ పేరును పరిశీలిస్తున్నట్టు టాక్. ఒకవేళ ‘బ్లడీ రోమియో’లో కూడా ఆమె ఓకే అయితే, అది ఆమెకు రెండో తెలుగు సినిమా. అలాగే, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అన్నది విశ్లేషకుల మాట. భారీ ప్రాజెక్టులు త్రిప్తి కెరీర్‌కు బలమైన పునాదులు వేస్తాయన్న మాట వినిపిస్తోంది.

## నాని ఎనర్జీ అదిరింది..

‘ది ప్యారడైజ్’ కోసం నాని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరి 24న నాని బర్త్ డే సందర్భంగా ‘ఆయా షేర్’ టైటిల్‌తో సాంగ్‌ను రిలీజ్ చేయాలని చిత్ర బృందం భావిస్తోందట. ఆ అనౌన్స్‌మెంట్ కోసం విడుదల చేసిన ప్రోమోలో నాని ఎనర్జీ ఒక రేంజ్‌లో ఉందంటున్నారు. దసరా తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల -నాని కాంబినేషన్‌లో వస్తోన్న సినిమా ఇది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ‘ఆయా షేర్’ పాటను వందలాది డ్యాన్సర్లతో రామోజీ ఫిలిం సిటీలో భారీఎత్తున చిత్రీకరించినట్టు యూనిట్ చెబుతోంది. ఈ పాటకు బాణీలు అందించినది సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్. సుందర్ మాస్టర్ కొరియోగ్రఫీ సమకూర్చారు. మారిన విడుదల తేదీ నేపథ్యంలో సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ వరల్డ్ చిత్రంగా ‘ది ప్యారడైజ్’ను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయనున్నారట.




ఏపీలో ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు
ఆర్టీసీ బస్సుల్లో
ఉచిత ప్రయాణం
మంత్రి నారా లోకేష్
ఆదేశాల మీదకు ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయం
పరీక్ష
హాల్ టికెట్
చూపిస్తే
చాలు
BOARD OF INTERMEDIATE EDUCATION : A.P.
INTERMEDIATE PUBLIC EXAMINATION
2nd Year Hall-Ticket